గుంటూరు వార్త



గుంటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి స్వాగతం పలికిన కూటమి ఎమ్మెల్యేలు, నేతలు, అధికారులు.(గుంటూరు, ఫిబ్రవరి 22,ప్రభాతవార్త )



# డాక్ సేవకుల సేవలు చిరస్మరణీయం..!

**గుంటూరులో గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనంలో సీఎం చంద్రబాబు**

**టెక్నాలజీ పెరిగినా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి సాంకేతికత అందుబాటులోకి వచ్చినా డాక్ సేవక్ ల స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పార్సిల్ వెళ్లాలంటే డాక్ సేవకుల వల్లే సాధ్యం. గతంలో అతిపెద్ద కమ్యూనికేషన్ వ్యవస్థ పోస్టల్ సేవలే. భారతీయ తపాలా శాఖకు ఉన్నంత నెట్వర్క్ మరే దేశంలోనూ ఏ పోస్టల్ సంస్థకు లేదు...**

**-టెక్నాలజీ పెరిగినా గ్రామీణ డాక్ సేవక్‌ల స్థానం భర్తీ కాదు**

**-ఎలక్ట్రిక్ సైకిళ్లతో వారికి మరింత సదుపాయం**

**గుంటూరు ఫిబ్రవరి 22, ప్రభాతవార్త ప్రతినిధి :** గుంటూరులో నిర్వహించిన గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళన్ కార్యక్రమంలో కేంద్రమంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గ్రామీణ డాక్ సేవకుల సేవలు చిరస్మరణీయమని.. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ పార్సిల్ వెళ్లాలంటే డాక్ సేవకుల వల్లే సాధ్యమని అన్నారు. తాను చదువుకునే రోజుల్లో ఏ పని కావాలన్నా తపాలా వ్యవస్థపైనే ఆధార పడేవాళ్లమని గుర్తు చేశారు. గతంలో అతిపెద్ద కమ్యూనికేషన్ వ్యవస్థ పోస్టల్ సేవలే అని.. పార్సిళ్లు, మనీ ఆర్డర్ల కోసం పోస్ట్ మ్యాన్ ఎప్పుడు వస్తారా అని ఎదురు చూసే పరిస్థితని తెలిపారు. భారతీయ తపాలా శాఖకు ఉన్నంత నెట్వర్క్... మరే దేశంలోనూ ఏ పోస్టల్ సంస్థకు లేదన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పరోక్షంగా కీలక పాత్ర పోషించిన ఘనత పోస్టల్ శాఖకు ఉందన్నారు.

**కేంద్ర మంత్రి సింధియా మాట్లాడుతూ ..**

విజనరి లీడర్ చంద్ర బాబుతో కలసి డాక్ సేవక్ సమ్మేళన్ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనంలో 10 వేల నా కుటుంబ సభ్యులతో పాల్గొనడం కూడా భావోద్వేగంగా ఉందని తెలిపారు. విశాఖపట్నంలో మా పూర్వీకులు వంద సంవత్సరాల క్రితం షిప్ తయారీ కేంద్రం ను ఏర్పాటు చేశారని... ఇప్పటికీ సింధియాగా ఆ ప్రదేశం విరాజిల్లుతోందిని తెలిపారు.ఎండ, వర్షం, చలి ఏ వాతావరం అయినా కనిపించేది గ్రామీణ డాక్ సేవక్ లే అని అన్నారు. దేశంలో ఏ చిట్ట చివరి ప్రాంతానికైనా సేవలు అందించేది గ్రామీణ డాక్ సేవక్ లు అని అన్నారు.





**కేంద్రమంత్రి డా. పెమ్మసాని మాట్లాడుతూ..**

దేశవ్యాప్తంగా 7 శాతం వృద్ధి రేటు ఉన్న సమయంలో 14 శాతం జిడిఎస్ సాధించి ఆంధ్రప్రదేశ్ ను దేశానికే ఆదర్శంగా నిలిపిన ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో పోస్టల్ డిపార్ట్మెంట్ ఖర్చు రూ. 1800 కోట్లు వుండగా, ఆదాయం మాత్రం రూ. 600 కోట్లు ఉందని అన్నారు. మోదీ కలలుగన్న 2047 అభివృద్ధి చెందిన భారతదేశం కావాలంటే మనమందరం మరింతగా కష్టించి పని చేయాలన్నారు.గ్రామాలలో ప్రతి ఇంటి తలుపు తట్టి పనిచేస్తున్న జిడిఎస్ లకు ప్రోత్సాహంగా ఉండే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు.





# నేటి నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు

**పరీక్ష గదులలో విద్యార్థుల కదలికల పరిశీలనకు 13,047 సీసీ కెమెరాలు**

**గుంటూరు విద్య ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్ పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా సోమవారము నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో గుంటూరు జిల్లాలో జరిగే పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి జిల్లా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. గుంటూరు జిల్లా ఆర్ఐఓ, డి ఈ సి కన్వీనర్ జి. సునీత పరీక్షలకు సంబంధించిన ఆయా కేంద్రాలను పరిశీలించి సీటింగ్ అరేంజ్మెంట్స్ అంశాలను ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ లను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 87 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. ప్రథమ సంవత్సర పరీక్షలకు 35486 మంది హాజరు కానుండగా వీరిలో బాలికలు 16542 మంది కాగా బాలురు 18944 మంది ఉన్నా రు . ద్వితీయ సంవత్సర పరీక్షలకు మొత్తం 33070 మంది హాజరు కానుండగా వీరిలో బాలికలు 15 689 మంది కాగా బాలురు 17381 మంది ఉన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి ప్రతి పరీక్షా కేంద్రంలోని పరీక్ష గదులలో విద్యార్థులను పరీక్ష సమయంలో పరిశీలించడానికి 13 0 47 సీసీ కెమెరాలు అమర్చారు. ఎలాంటి కాపీయింగ్కు అవకాశం లేకుండా పగడ్బందీ చర్యలు చేపట్టారు. విద్యార్థులు పరీక్షకు వచ్చేటప్పుడు మొబైల్ ఫోన్లు తీసుకురావద్దని , ప్రతి ఒక్కరూ నిర్దిష్టం పరీక్ష సమయానికి కంటే అరగంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, తద్వారా ఆలస్యాన్ని నివారించుకోవాలని అధికారులు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల సందేహాల నివృత్తికి ఆర్ఐఓ కార్యాలయంలో హెల్ప్ లైన్ .0863 2221544 ఫోన్ నెంబరు ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లా ఇంటర్మీడియట్ పరీక్షల ముఖ్య పరిశీలకులుగా డి వి ఈ ఓ, ఇన్చార్జి గుంటూరు ఆర్జెడి పద్మను నియమించారు. పరీక్షలు ఈనెల 23వ తేదీ నుండి ప్రారంభమై వచ్చే నెల 24వ తేదీతో ముగియనున్నాయి. పరీక్షల తేదీల్లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నాం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. సిట్టింగ్ స్క్వాడ్ లు 3, ఫ్లయింగ్ స్క్వాడ్లు 4, హై పవర్ కమిటీ 1 పరీక్ష సమయాలలో నిరంతరం ఆయా పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేయనున్నాయి. తనిఖీ బృందాలు పర్యటించే వాహనాలకు సైతం ఉన్నత అధికారులు జియో ట్యాగ్ ఏర్పాటు చేయటం గమనించదగ్గ విషయం. చివరికి పరీక్షా కేంద్రంలోని చీఫ్ మాత్రమే బేసిక్ ఫోను తొలి అరగంట పరీక్ష విధులు నిర్వహణ కొరకు వాడడానికి అవకాశం కల్పించారు. అంతకుమించి ఎవరూ కూడా మొబైల్ ఫోన్ లను తీసుకురావడానికి అవకాశం లేదు. ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించి ఇవిజిలేటర్లకు చీఫ్ సూపర్డెంట్ లకు డిపార్ట్మెంట్ ఆఫీసర్లకు కస్టోడియన్లకు పరీక్షల విధి నిర్వహణ పట్ల అవగాహన పరుస్తూ దిశ నిర్దేశాన్ని జిల్లా ఉన్నతాధికారులు చేశారు.



# జర భద్రం..!

## అప్రమత్తంగా లేకుంటే అంతే సంగతులు..



(గుంటూరు కార్పొరేషన్,ప్రభాతవార్త)

**గుంటూరు** నగరంలో వీధి కుక్కల కాటుకు బలైపోతున్న బాధితుల సంఖ్య రోజు రోజుకి పెరిగిపోతుంది. ఆదమరిచి రోడ్లలో ప్రయాణిస్తే ఎటువైపు నుంచి ఏ కుక్క వచ్చి కరుస్తుందోనని ఉక్కిరి బిక్కిరి తో భయభ్రాంతులకు గురై పోవలసిన పరిస్థితి దాపురించిందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. కుక్క కాటుకు గురైన ఎంతోమంది బాధితులు ప్రాణ భయంతో ప్రభుత్వ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. గుంటూరు నగరం తో పాటు జిల్లాలోని అనేక పట్టణాలు గ్రామాలలో కుక్క కాటు బాధితుల రోజురోజుకు పెరిగిపోతున్నారు. వీధి కుక్కల నియంత్రణలో గుంటూరు కార్పొరేషన్ అధికారులు పూర్తిస్థాయిలో విఫలం చెందారని

10

-పిచ్చి పట్టిన కుక్కలు నగర వీధుల్లో సంచారం..
- కుక్కల కాటు పడితే ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం..
-వీధి కుక్కల కాట్లుతో నగర వాసులు ఉక్కిరి బిక్కిరి...!..
-సుప్రీం కోర్టు ఆదేశాలను తుంగలో తొక్కేస్తున్న జిల్లా అధికార యంత్రాగం ..
-డాగ్ సెల్టర్ జోన్స్ ఏర్పాటులో తాసారం... కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం.....
-డాగ్ లవర్స్ నుంచి పెనాల్టీ వసూళ్లు చేయాలన్న కోర్టు ఆదేశాలు పట్టించుకోని అధికారులు
-ప్రభుత్వ ఆసుపత్రి రికార్డులు పరిశీలిస్తే కుక్కల కాటుకు బలవుతున్న బాధితుల సంఖ్యకు ప్రత్యక్ష సాక్ష్యం.

# సభ్యత్వన మోదులో ముందంజలో నిలవాలి

## కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన నాదెండ్ల

**తెనాలి టౌన్ ఫిబ్రవరి22(ప్రభాతవార్త):** ఫిబ్రవరి 26నుండి ప్రారంభమోతున్న జనసేన పార్టీ సభ్యత్వనమోదు కార్యక్రమంలో ముందంజలో ఉండాలని స్థానిక శాసనసభ్యులు,జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, కార్యకర్తలకి పిలుపునిచ్చారు.ఆదివారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్క జన సైనికుడు వీర మహిళలు ఇది ఒక గొప్ప అవకాశంగా భావించి జనసేన క్రియాశీలక సభ్యత్వం రెన్యువల్ మరియు కొత్త సభ్యత్వం ధృవీకరణ చేసుకొని మీ యొక్క బంధుమిత్రులు శ్రేయోభిలాషులు అందరికీ తెలియపరచి వారి యొక్క సభ్యత్వం కూడా మీరే బాధ్యతగా తీసుకొని చేయించి జనసేన పార్టీకి మరియు మన కుటుంబ భద్రతకు పునాదులవుతారని, ఆశిస్తూ ఫిబ్రవరి 26న జరగబోయే సభ్యత్వ కార్యక్రమానికి సిద్ధం కావాలన్నారు.ఉద్యమిపార్టీ భావజాలాన్ని లోతుగా అర్థం చేసుకుని, సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేయాలని సంకల్పంతో సభ్యత్వం తీసుకునేవారు.సాధక్‌పార్టీ పోరాటానికి బలం చేకూర్చేలా కొత్తవారిని ప్రేరేపిస్తూ, యువతలో స్ఫూర్తి నింపుతూ సభ్యత్వాలు చేయించేవారు.ప్రదాతపార్టీ బలోపేతానికి ఆర్థిక, సాంకేతిక లేదా మేధోపరమైన సహకారం అందించేవారు.ఈ విధంగా కార్యక్రమం నిర్వహించబడుతుందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు,వీరమహిళలు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

**సిఎంఆర్ఎఫ్ ద్వారా 483 మందికి లబ్ధి:** గత 20 నెలల కూటమి పాలనలో ప్రజల ఆరోగ్యానికి విశేష ప్రాధాన్యం ఇచ్చిందని, సీఎంఆర్ఎఫ్ ద్వారా తెనాలి నియోజకవర్గానికి



రూ.5,05,82,019/ సాయం అందించామని,ప్రజల ఆరోగ్య సమస్యల సమయంలో ఆర్థికంగా అండగా నిలవడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. గత 20 నెలలుగా కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకుని, వైద్య అత్యవసర పరిస్థితుల్లో బాధపడుతున్న కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందిస్తోందని,సిఎంఆర్ఎఫ్ ద్వారా తెనాలి నియోజకవర్గ ప్రజలకు ఇప్పటి వరకు 483 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.5,05,82,019/.. ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైద్య చికిత్సల ఖర్చులు భారంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ సహాయం అనేక కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం కలిగిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయం అందేలా పారదర్శకంగా, వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.సమయానికి అందే సహాయం ప్రజల పట్ల ప్రభుత్వ బాధ్యతకు నిదర్శనమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.ప్రజల సంక్షేమం, ఆరోగ్యం మరియు భద్రత కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# పెండ్లి కుమారునిగా నరసింహుడు



**మంగళగిరి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో శ్రీ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా తొలిరోజైన ఆదివారం శ్రీవారి పెండ్లి కుమారుని ఉత్సవంతో బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో తెల్లవారుజామున స్వామివారి తీర్థ బిందె తీసుకురావడం, పాతఃకాల అర్చన, వైఖానస ఆగమం యుక్తంగా విష్వక్షణ ఆరాధన, అష్టదిక్పాలక అర్చన, నవ కలశ ఆరాధన, పంచామృత స్నపన, విశేష అలంకరణ, స్వామి వారు, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేయుట. తీర్థ గోష్టి పూజలు జరిగాయి. దేవస్థాన ప్రధాన అర్చకులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు పూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీ స్వామి వార్లను దర్శించుకున్నారు. దీంతో దేవాలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. పట్టణ పద్మశాలీయ బహుత్తమ సంఘం కైంకర్యపరులుగా వ్యవహరించారు. దేవస్థానం సహాయ కమిషనర్ అండ్ కార్యనిర్వాహణాధికారి కోగంటి సునీల్ కుమార్, ధర్మకర్తల మండలి పర్యవేక్షించారు.

# పల్నాడు గడ్డపై అభివృద్ధి ప్రదాత డాక్టర్ 'కోడెల'

## పెద్దరెడ్డిపాలెంలో విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే డాక్టర్ 'చదలవాడ'

**నరసరావుపేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** పల్నాడు గడ్డపై అభివృద్ధి ప్రదాతగా, పేదల పెన్నిధిగా చెరగని ముద్ర వేసిన మాజీ స్పీకర్, దివంగత నేత స్వర్గీయ డాక్టర్ కోడెల శివప్రసాద్ రావు సేవలు చిరస్మరణీయమని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు కొనియాడారు.





పెద్ద రెడ్డిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన డాక్టర్ కోడెల శివప్రసాద్ రావు విగ్రహాన్ని ఆయన ఆది వారం విశిష్ట అతిథిగా ఆవిష్క రించారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జాన్ సైదా , పార్టీ యువ నాయకులు డాక్టర్ కోడెల శివరాం ఈ సందర్భంగా జరిగిన సభలో పాల్గొని మాట్లాడారు. డాక్టర్ కోడెల చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని, ప్రజాసేవలను వివరించారు. పల్నాడు జిల్లాతో పాటు రాష్ట్ర అభివృద్ధిలోనూ వారి పాత్రను, తెలుగుదేశం పార్టీ విజయాలలో వారి సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం సభలో ఎమ్మెల్యే అరవింద బాబు మాట్లాడుతూ.. "పల్నాడు పులి"గా పేరుగాంచిన కోడెల ఈ ప్రాంత అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని గుర్తుచేశారు. ఒక వైద్యుడిగా వృత్తి పట్ల నిబద్ధత, రాజకీయ నాయకుడిగా ప్రజాసేవ పట్ల ఆయనకు ఉన్న తపన నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. నరసరావుపేట నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడంలో కోడెల గారి పాత్ర మరువలేనిదని, ఆయన చూపిన బాటలోనే తాము కూడా పయనిస్తూ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. గ్రామంలో కోడెల విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఆయన స్మృతిని చాటుకున్న పెద్ద రెడ్డిపాలెం గ్రామస్తులను, అభిమానులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, కోడెల అభిమానులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘన నివాళులర్పించారు.

# స్వాతంత్రోద్యమ స్ఫూర్తిప్రదాత మౌలానా అబుల్ కలాం : డాక్టర్ గోపిరెడ్డి

**నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద దివంగత నేత మౌలానా అబుల్ కలాం ఆజాద్ కు పల్నాడు జిల్లా వైయస్సార్సీపి వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆదివారం నివాళులర్పించారు. మోలానా అబుల్ కలాం ఆజాద్ 69వ వర్ధంతి కార్యక్రమం సందర్భంగా స్థానిక గుంటూరు రోడ్ లోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళుల ర్పించారు.డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ.... భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి గా సేవలందించిన మోలానా అబుల్ కలాం ఆజాద్ కృషి చేశారన్నారు.తన రచనల ద్వారా యువతలో స్వాతంత్ర ఉద్యమ చైతన్య స్ఫూర్తిని కలిగించారని పేర్కొన్నారు.ఆయన మహాత్మా గాంధీ మరియు జవహర్లాల్ నెహ్రూ తో కలిసి స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని తన పుస్తకాలు, రచనల ద్వారాయువతను చైతన్యపరిచార్ని తెలిపారు.స్వాతంత్ర పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించారు. యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. బోయిన సుబ్బారావుకు నివాళులర్పించిన డా.గోపిరెడ్డి.. పట్టణంలోని ఫంక్షన్ హాల్ నందు భీష్మ బోయిన సుబ్బారావు ప్రథమ వర్ధంతి లో వైయస్సార్సీపి పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి నివాళులు అర్పించారు. డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తో పాటు వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.



## చెత్తనుంచి సంపద తయారీపై అవగాహన

**కారంపూడి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటి నుంచి సేకరించే చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ నిర్వహించి అన్ని గ్రామ పంచాయతీలకు చెత్తను సేకరించే రిక్షాలను, డబ్బాలను మండల పరిషత్ అధ్యక్షులు బొల్లేడి కనకదుర్గ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ కె.సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.



# పక్కా ప్రణాళికతో శ్రీవారి ప్రతిష్టను దెబ్బతీయాలని చూస్తున్న 'భూమన'

## -ఎపి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరామ్ ప్రసాద్ ధ్వజం

**గుంటూరు, పిబ్రవరి 22, ప్రభాతవార్త ప్రతినిధి:** అధికారంలో ఉన్నప్పుడు శ్రీవారిని నిలువు దోపిడి చేసి... ఇప్పుడు అసత్య ప్రసారాలు, యాగాలు పేరుతో ప్రజలను.. భూమన కరుణాకర్ రెడ్డి తప్పు దోవ పట్టిస్తున్నారని ఎపి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరామ్ప్రసాద్ ధ్వజమెత్తారు. . వరుస ప్రెస్ మీట్ ల పేరుతో పథకం ప్రకారం శ్రీవారి ప్రతిష్టను భూమన దెబ్బతీయాలని చూస్తున్నారని, తిరుమల ప్రసాదంలో వాడే నెయ్యిలో కల్తీ జరిగిందని సిట్ నివేదిక రాగానే వైసీపీ నాయకులు కొత్త నాటకాలకు తెరలేపారన్నారు. హెరిటేజ్ పై తప్పుడు ఆరోపణలు చేస్తూ.. అంశాన్ని పక్కదారి పట్టించాలని చూస్తున్నారన్నారు. ఇండపూర్ డెయిరీకి హెరిటేజ్ కొలుగోలుదారే గానీ సరఫరాదారు కాదన్నారు. గతంలో తిరుమల మాడ వీధుల్లో జగన్మోహన్ రెడ్డి చెప్పులు వేసుకొని తిరిగారని,. నేడు శాసన మండలిలో వైసీపీ సభ్యులు చెప్పులు వేసుకొని శ్రీవారి ఫొటోలు ప్రదర్శించారన్నారు. హిందూ భక్తుల మనోభావాలను కాపాడడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సిట్ నివేదిక ఆధారంగా నాడు కల్తీ నెయ్యి అంశంలో జరిగిన అవినీతిని మరింత బయట పెట్టేందుకు ప్రభుత్వం ఏక సభ్య కమీషన్ వేసిందని, తిరుమలలో జరిగిన ప్రతి అవినీతిని కూటమి ప్రభుత్వం వెలికి తీస్తుందన్నారు.

# చంద్రబాబుతో డైనమాటిక్ టెక్నాలజీస్ ప్రతినిధుల భేటీ

**గుంటూరు, పిబ్రవరి 22, ప్రభాతవార్త ప్రతినిధి:** సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆదివారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో డైనమాటిక్ టెక్నాలజీస్ ప్రతినిధుల భేటీ అయ్యారు. డైనమాటిక్ టెక్నాలజీస్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎండీ ఉదయంత్ మల్హోత్రా, ప్రిన్సిపల్ సీఎఫ్ఓ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీ.చలపతి, అహల్యా మల్హోత్రా జనరల్ మేనేజర్. ఆ సంస్థ యూరప్



వ్యాపార కార్యకలాపాల సీనియర్ ఎగ్జిక్యూటివ్ క్రిస్టినా లిడేగార్డ్ సీఎంతో జరిగిన సమావేశంలో ఉన్నారు. ఏవియేషన్ రంగంలో, డిఫెన్స్ మాన్యు ఫ్యాక్చరింగ్‌లో తమ సంస్థ కార్యకలాపాలపై ప్రజంటేషన్ ఇచ్చారు. డిఫెన్స్ రంగంలో తమ సంస్థ అనుభవాన్ని వివరించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు ఎపి ప్రభుత్వ విధానాలు, డిఫెన్స్, ఏరో స్పేస్ రంగంలో ఉన్న అవకాశాలను వివరించారు. ఈ సమావేశంలో పరిశ్రమలు శాఖ కార్యదర్శి యువరాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



# వైసీపీ నేతలకు దేవుడంటే భయం భక్తి లేకుండా పోయింది..

## -షేక్ జానీ సైదా, 'కూటమి' నాయకులు

**నరసరావుపేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** వైసీపీ నేతలు శాసన మండలిలో చెప్పులు వేసుకొని దేవుడు పటాలను పట్టుకోవడం దుర్మార్గమని టిడిపి జిల్లా అధ్యక్షులు షేక్ జాన్ సైదా అన్నారు. రాజకీయ అవసరలా కోసం దేవుణ్ణి అడ్డం పెట్టుకొని నీచమైనస్థితికి దిగజారారని విమర్శించారు. ఆదివారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయల శ్రీనివాసరావు తదితరులతో కలిసి మాట్లాడారు.దేవుడు ప్రసాదములో జంతువు కొవ్వు, రసాయన పదార్థంను కలపటమే కాకుండా వైసీపీ నాయకులు వితండ వాదన చేస్తున్నారని అన్నారు.హిందూ మతం మీద మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి భక్తే లేదన్నారు.దేవుడుతో ఆడుకున్నారు కాబట్టే వైసిపి 11 సీట్లు తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. రూ.2 కోట్ల విలువైన తలనీలాలను మొదట మయన్మార్, అక్కడి నుంచి థాయ్ ల్యాండ్ మీదుగా చైనాకు అక్రమంగా తరలిస్తుండగా అస్సాం రైఫిల్స్ పట్టుకోవడమే దీనికి ఉదాహరణ అని పేర్కొన్నారు.వైసీపీ హయంలో 300కు పైగా దేవాలయాలపై దాడులు, విగ్రహాల ధ్వంసం ఘటనలు జరిగాయన్నా రు.ముఖ్యమంత్రిగా ఒక్కరోజు కూడా వెళ్లి జగన్మోహన్ రెడ్డి పరిశీలించలేదు.బిజెపి జిల్లా పార్టీ అధ్యక్షుడు శశికుమార్ మాట్లాడుతూ జీవితంలో వైసీపీ పాపాలను వారు కడుక్కోలేరని మండిపడ్డారు. ఈ కార్యక్రమములో నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, జనసేన వీర మహిళ మిరియాల సుబ్బమ్మ, నరసరావుపేట మండల జనసేన పార్టీ అధ్యక్షులు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రకటనలకే పరిమితమైన 'కూటమి' ప్రభుత్వం

## మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి విమర్శ

**నరసరావుపేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వినుకొండ పర్యటన కేవలం మాటలకు,ప్రకటనలకు మాత్రమే పరిమితమైందని వైసిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం "గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట పట్టణం లోని 34వ వార్డు బీసీ కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసు కున్న ఆయన ప్రభుత్వ వైఫల్యాలపై మండిపడ్డారు.బిసి కాలనీలో పారిశుధ్యం పూర్తిగా పడకేసిందని మురుగు కాల్వలలో మురుగు పేరుకు పోయి కాల్వలో ప్రవహిం చాల్సిన మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుందన్నారు. కాలనీ వాసులు 600 మందికి పైగా నివాసితులు మున్సిపాలిటీకి పన్నులు కడుతున్నప్పటికీ, వారికి కనీస మోలిక సదుపాయాలు కల్పించడంలో పాలకులు నిరక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు.వైసిపి హయాంలో అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రైన్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే పారిశుధ్య పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## 'మీ-సేవా'ల మనుగడను కాపాడాలి: అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాము

**నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మీ సేవల మనుగడను కాపాడాలని మీసేవ ఆపరేటర్ల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పోరుమామిళ్ల రాము విజ్ఞప్తి చేశారు.నరసరావుపేట పట్టణంలో ఆదివారం గీతామందిరంలో జరిగిన ఏపి మీసేవ నిర్వాహకుల వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో రాము మాట్లాడుతూ 25 ఏళ్లుగా మీసేవల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందిస్తూ చాలీచాలని ఆదాయంతో బ్రతుకుతున్న ఆపరేటర్ల మనుగడ ప్రశ్నార్థకమైం దన్నారు.వైసిపి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని అన్నారు.నాడు యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ కు తమ సమస్యలు వివరించగా అధికారం లోకి రాగానే మీ సేవలకు పూర్వ వైభవం తీసుకొస్తామని ఆపరేటర్ల సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం అసోసియేషన్ పల్నాడు జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పల్నాడు జిల్లా నూతన అధ్యక్షులుగా గట్టుపల్లి మహేష్, ఉపాధ్యక్షులుగా కొత్త శేషగిరిరావు గౌరవ అధ్యక్షులుగా కొమ్ము ప్రకాష్, దాసరి రాజశేఖర్, వేల్పూరు గణపతిజ్ ప్రధాన కార్యదర్శిగా జలసూత్రం హరిబాబు, కార్యదర్శిగా రాయుడు సతీష్ ,నూలి శ్రీను, కాట్ల రామాంజనేయులు, మహిళా కార్యదర్శి గాదె శాంత కుమారి ఎన్నికయ్యారు.



# ఎంఇఓ కార్యాలయంలో 'స్వచ్ఛభారత్'




**మాచర్ల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వ ర్యంలో స్థానిక ఎంఈఓ కార్యాల యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ధ్యేయంగా గ్రీన్ మాచర్ల సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సేవాసమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. ఎంఈఓ కార్యాలయ పరిసరాలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు అంగన్‌వాడీ టీచర్ రుక్మిణి, నాగశంకర్‌రెడ్డి, సుందరమ్మ, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో విశ్రాంతి గదులకు మరమ్మతులు

**మాచర్ల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో విశ్రాంతి గదుల మరమ్మతులకు మున్సిపల్ ఛైర్మన్ మదార్‌సాహెబ్ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.33 లక్షలతో వసతిగదుల మరమ్మతులకు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్, మాచర్ల పట్టణ టీడీపీ అధ్యక్షులు కొమెర దుర్గారావు, ఆసుపత్రి మెంబర్, యూనిట్ ఇన్‌ఛార్జి మాచర్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రతిగ్రామం పరిశుభ్రంగా ఉండేందుకే స్వచ్ఛరథం'

**కారంపూడి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** ప్రతి గ్రామంలో పొడి చెత్తను సేకరించి వాటిని వివిధ సంపద కేంద్రాలకు తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమమే స్వచ్ఛరథం. సీఎం చంద్రబాబు వినుకొండలో లాంఛనంగా ప్రారంభించినట్లు ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలో 15 గ్రామాలకు ఒక స్వచ్ఛరథం వాహనాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. పొడిచెత్త వల్ల గ్రామాల్లో వివిధ వ్యర్థ వస్తువులు కొనుగలు చేసి వాటికి సరపరా నిత్యావసర వస్తువులు అందించనున్నట్లు తెలిపారు. దీంతో ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని తెలిపారు. మండలంలోని చిన్నగార్లపాడు గ్రామంలో డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గ్రుబునాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు నేతలు పాల్గొన్నారు.



# మృతుని కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత

**నరసరావుపేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను తమ కుటుంబ సభ్యుడిలా భావించి ఆదుకుంటామని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు గారు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా, రొంపిచర్ల మండలం, మాచవరం గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త పొడిచెర్ల (వడిచెర్ల) రామాంజనేయ రెడ్డి గారు ఇటీవల అకాల మరణం చెందారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు. ఈ క్రమంలో, తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమ విభాగం ద్వారా మంజూరైన రూ. 5,00,000 (ఐదు లక్షల రూపాయల) ప్రమాద బీమా చెక్కును రామాంజనేయ రెడ్డి భార్య సుమలతకు ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



**'భారతరత్న' మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు ఎమ్మెల్యే ఘననివాళి**

భారత తొలి విద్యాశాఖ మంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 69వ వర్ధంతి వేడుకలను నరసరావుపేట పట్టణంలోని చిత్రాలయ సెంటర్ వద్ద అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొని, ఆజాద్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎన్నో ప్రతిష్టాత్మక సంస్థలన్నీ ఆజాద్ దూరదృష్టి ఫలితమేనని కొనియాడారు. దేశంలో లలిత కళా అకాడమీ, సంగీత నాటక అకాడమీ వంటి సంస్థలను స్థాపించి, భారతీయ కళలు మరియు సంస్కృతిని కాపాడటంలో ఆయన కీలక పాత్ర పోషించారని ఎమ్మెల్యే గారు వివరించారు. ప్రతి పౌరుడు ఆజాద్ గారి ఆశయాలను స్మరిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మరియు పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆజాద్ గారికి అంజలి ఘటించారు.

# ఎపీజేఏసీ పల్నాడు జిల్లా చైర్మన్‌గా మర్లపాటి రామకృష్ణ ఏకగ్రీవం

**నరసరావుపేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్ర ఏపీ ఎన్జీజిఓ అధ్యక్షులు మరియు జేఏసీ చైర్మన్ ఏ.విద్యాసాగర్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా సమావేశం నిర్వహించారు.ప్రభుత్వ, ఉపాధ్యాయ,ఉద్యోగ, పెన్షనర్ల, కార్మికుల సంఘాల సంయుక్త కార్యచరణ సమితి సమావేశం స్థానిక ఎన్జీ జిఓ హోమ్, ప్రకాష్ నగర్ లో జరిగింది. ఈ సమావేశంలో పలు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు,పెన్షనర్లు కార్మికుల సమస్యల గురించి మాట్లాడటం జరిగింది. పిఆర్సి ఏర్పాటు, ఫిట్మెంట్ 30 పెన్షనర్ల అడిషనల్ క్వాంటం పెంచటం, సిపిఎస్ ఉద్యోగుల సమస్యలను చర్చించారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందుల సమస్యలను పరిష్కారం కొరకు రాష్ట్ర జేఏసీ ఏ కార్యచరణ అయితే ప్రకటిస్తుందో ఆ కార్యాచరణ ప్రకారం ఉద్యమించాలని సమావేశం అభిప్రాయపడింది.ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ గా ఎం.రామకృష్ణ, కో చైర్మన్ల గా ఎస్ మురారి, కె ఎస్ కె షరీఫ్, బి సంపత్ బాబు, ఏ ఏమండీ వైస్ చైర్మన్ల గా ఎస్ సుబ్బారావు, ఉబేద్ బేగ్, పి ఐ జె మరియరాజు, ఎం రామయ్య, సెక్రటరీ జనరల్ గా ఎం మోహన్ రావు, జాయింట్ సెక్రటరీగా కె ప్రతాప్ కుమార్, సిసి ఆదెయ్య, ఎస్ కొండయ్య, ఏ ఆంజనేయులు, ఎస్.కె కమల్ భాష, కే బ్రహ్మయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం ఆనంద్ నాథ్,ట్రెజరర్ గా కె నాగేశ్వరావు ఎన్నికయ్యారు. సమావేశమునకు రాష్ట్ర ఎన్జీజిఓస్ ఉపాధ్యక్షులు శ్రీ ఎస్ రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సమావేశంలో ఉద్యోగులకు, పెన్షనర్లకు మరియు ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుండి రావలసిన బకాయిలు తదితర అంశములు భవిష్యత్తులో రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు చేయవలసిన కార్యక్రమాల గురించి చర్చించడం జరిగింది.




# 'రేనాటి సూర్యుడు...ఉయ్యాలవాడ నరసింహారెడ్డి'

**నరసరావుపేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** తొలి స్వాతంత్ర సమరయోధుడు బ్రిటిష్ వారిపై అలుపెరగని పోరాటం చేసిన యుద్ధ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 179 వ అమరవీర వర్ధంతిని నరసరావుపేటలో ప్రకాష్ నగర్ లో పల్లాడు జిల్లా రెడ్డి బిజినెస్ గ్రూప్ (ఆర్ బి జి) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా తుమ్మూరు శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించారు. బ్రిటిష్ వారిపై దాదాపు 180 సంవత్సరాలకు పూర్వం తిరగబడిన తెలుగు బిడ్డ నరసింహారెడ్డి అని వారి త్యాగాన్ని వివరించారు. ప్రకాష్ నగర్ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి మాట్లాడుతూ నేటి తరానికి స్వాతంత్ర సమరయోధులు యొక్క త్యాగాలను వివరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్వర్ణ చినరామిరెడ్డి మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి గారి వంశానికి సంబంధించిన కొన్ని విషయాలు, పాలగాళ్లకు బ్రిటిష్ వారికి మధ్య జరిగిన ఘర్షణలు, క్రీస్తు శకం 1800వ సంవత్సరంలో రాయలసీమను బ్రిటిష్ వారు నైజాం నవాబు నుండి ఆక్రమించి పాల గార్ల యొక్క హక్కులను ధరించి వారి భూములను ఆక్రమించుట చివరకు వారిని కేవలం పింఛన్ దారులుగా మార్చడం, ఎదురు తిరిగిన వారిని అణచివేయడం వంటి వాటిపై వివరించారు. తొమ్మిది వేల సైన్యంతో నరసింహారెడ్డి కడప కర్నూలు గిద్దలూరు నల్లమల్ల అడవుల్లో గిరిల పోరాటాన్ని చేసి ఎనిమిది నెలల పాటు బ్రిటిష్ వారికి కంటి పై కొడుకు లేకుండా చేశారని అన్నారు. చివరకు విద్రోహ చర్య వలన కొత్తకోట జగన్నాథ స్వామి దేవాలయంలో ఉన్న నరసింహారెడ్డిని కాక్రెన్ దొర చుట్టుముట్టి 1846 అక్టోబర్ నెలలో కాల్పులు జరిపి బంధించారని , అనంతరం ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రభుత్వ యొక్క విచారణలో హత్య అరాచకాలు దోపిడీ ప్రభుత్వంపై తిరుగుబాటు వంటి పలు అభియోగాలను మోపి ఉరిశిక్ష విధించి తర్వాత కోవెలకుంట్ల సమీపంలోని జుర్రెడు వద్ద 1847 ఫిబ్రవరి 22 వ తేదీ ఉదయం 7.00 గం లకు ఉరితీసి, కోవెల కుంటల నరసింహారెడ్డిని ఉరితీసి కోట టేకు మానుకు వేలాడు తీశారు. 30 సంవత్సరాల పాటు నరసింహారెడ్డి తల వేలాడుతూనే ఉందన్నారు.. ఈ కార్యక్రమంలో గంగుల కృష్ణారెడ్డి కంజుల రమణారెడ్డి తీయగూరలు పాల్గొన్నారు వీరారెడ్డి జీవీఎస్ రెడ్డి ఎర్రం రెడ్డి నాగేశ్వర్ రెడ్డి భవనం శ్రీనివాసరెడ్డి అన్నం నారపరెడ్డి, రామిరెడ్డితదితరులు పాల్గొన్నారు.




## 'బిజెపి సామ్రాజ్యవాద విధానాలను ఐక్యతతో తిప్పికొట్టాలి'

**రొంపిచర్ల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** సామ్రాజ్యవాదానికి కొమ్ము కాస్తున్న బిజెపి విధానాలను ప్రపంచ విప్లవాలకు మార్గదర్శి మార్క్స్, ఎంగెల్స్ కమ్యూనిస్ట్ ప్రణాళిక ద్వారా తిప్పి కొట్టాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్. ఆంజనేయులు నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక కోటప్పకొండ రోడ్డు లోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం రెడ్ బుక్ డే నిర్వహించారు. సిపిఎం నరసరావుపేట మండల కన్వీనర్ డి.శివ కుమారి అధ్యక్షత వహించిన సభలో ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ పెట్టుబడిదారి దోపిడి కబంధ హస్తాలలో చిక్కుకున్న కార్మిక లోకానికి దిశా నిర్దేశం చూపిన కారల్ మార్క్స్ 178 ఏళ్ల క్రితం రాసిన కమ్యూనిస్టు ప్రణాళిక ప్రతి ఒక్కరూ చదవాలని అన్నారు.ప్రపంచ దేశాలపై ఆధిపత్యం కోసం సుంకాలను విధిస్తూ లొంగని దేశాలపై దాడులు చేసి దేశఅధ్యక్షులలను బంధీలను చేస్తుందన్నారు. అంతర్జాతీయ న్యాయ వ్యవస్థను,ఐక్యరాజ్య సమితిని సైతం లెక్క చేయకుండా అమెరికా సామ్రాజ్యవాద వైఖరి ప్రదర్శిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో అన్ని రాజకీయ పార్టీలకు సోషలిజమే ప్రత్యామ్నాయమన్నారు.కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి.పెద్దిరాజు, నాయకులు షేక్.సిలార్ మసూద్, సయ్యద్ రబ్బాని, కొమ్ముల నాగేశ్వరరావు, మేడంఆంజనేయులు,దరువూరి సుబ్బారావు, కోంద్రు ఆంజనేయులు, సుభాష్ చంద్రబోస్, బి సలీం, షేక్ కరీం, నబీ బాజీ,నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# 'ఛలో విజయవాడ' ను విజయవంతం చేయండి

**రొంపిచర్ల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** ఎన్నికల మేనిఫెస్టో హామీల కొరకు ఎస్ టి యు చేపట్టిన దశలవారి పోరాటంలో భాగంగా చివరి దశ చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేయాలని ఎస్టీయు నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్టీయు భవన్ నందు జరిగిన ముఖ్యుల సమావేశంలో ఏఐఎస్టిఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సిహెచ్ జోసఫ్ సుధీర్ బాబు మాట్లాడారు. పిఆర్సి కమిటీని వెంటనే నియమిం చాలన్నారు. అప్పటివరకు 30 ఐ ఆర్ ప్రకటించాలని, పెండిం గ్లో ఉన్న 34 వేల కోట్ల రూపాయల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. పెండింగ్లో ఉన్న నాలుగు డిఎలను తక్షణమే విడుదల చేయాలని, పంచాయతీరాజ్ శాఖలో ఉన్న కారుణ్య నియామకాలను యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేసి కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు ఎల్వి రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కే కోటేశ్వరరావు మాట్లాడుతూ సిపిఎస్ ను ప్రభుత్వం రద్దుచేసి ఓ పి ఎస్ ను తక్షణం అమలు పరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు యు చంద్రజిత్, నాయకులు ఎం వెంకట కోటయ్య, సిహెచ్.అనిల్, ఎస్ ఎమ్ సుభాని, పి.సుశీల, ఏ ఏమండీ,ఎస్ కె మహబూబ్ సుభాని, కె.ఏసయ్య, పి.శ్రీనివాసరావు, పివి భీష్మారావ్, బి పూర్ణచంద్రరావు, వి నాగరాజారావు, బి రవి కుమార్, టి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## నల్లగార్లపాడులో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

**రొంపిచర్ల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :**మండల పరిధిలోని నల్లగార్లపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు గారు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ (దిదీశివీ) కాంత కుమారి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యం, గర్భిణీలు మరియు బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రభుత్వం విద్య మరియు వైద్య రంగాలకు ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగానే ఈ నూతన భవనాలను నిర్మించడం జరిగిందని, వీటిని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.అనంతరం సిడిపిఓ కాంత కుమారి గారు మాట్లాడుతూ.. కేంద్రానికి వచ్చే చిన్నా రులకు మెరుగైన వసతులు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో నాయకులు, అంగన్‌వాడీ కార్య కర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు



## గౌరీ రామకుమారికి సత్కారం



**రేపల్లె, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సి.వి.రామన్ సేవా సాంస్కృతిక సంస్థ రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఐదు రాష్ట్రాలకు చెందిన వంద మంది సేవాతత్పరులను సత్కరించిన కార్యక్రమంలో రేపల్లె పట్టణానికి చెందిన వాసవి ఆర్యవైశ్య మహిళా సంఘం గౌరవాధ్యక్షురాలు పి.గౌరీ రామకుమారి అవార్డు అందుకున్నారు.గోల్డ్ మెడల్,సువర్ణ కంకణం,వాసవి సేవ మహిళా శిరోమణి అనే బిరుదుతో సన్మానించారు.అంబికా దర్బార్ అధినేత కృష్ణ చేతుల మీదుగా గౌరీ రామకుమారి అవార్డు అందుకోవడం పట్ల రేపల్లె వాసవి ఆర్యవైశ్య మహిళా సంఘం కార్యవర్గం అభినందనలు తెలిపారు.

# బాపట్ల జిల్లా వార్త



## జాతీయ పోలీస్ అక్వాటిక్ ఛాంపియన్‌షిప్స్‌కు చందోలు వాసి ఎంపిక



**పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ వేదికగా ఈనెల 23వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరగనున్న 73వ ఆలిండియా పోలీస్ అక్వాటిక్ ఛాంపియన్‌షిప్స్ 2026 పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా బాపట్ల జిల్లా చందోలు గ్రామానికి చెందిన షేక్ ఖాజా మొహిద్దీన్ ఎంపికయ్యారు. స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ ప్రతిష్ఠాత్మక పోటీలకు ఆయనను అధికారికంగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల పోలీస్ బలగాలు, కేంద్ర సాయుధ బలగాల నుంచి అగ్రశ్రేణి ఈతగాళ్లు పాల్గొనే ఈ ఛాంపియన్‌షిప్‌లో చందోలు వాసి టెక్నికల్ బాధ్యతలు చేపట్టడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖాజా మొహిద్దీన్ క్రీడా రంగంలో చూపిస్తున్న ప్రతిభకు దక్కిన గౌరవంగా దీన్ని అభివర్ణిస్తున్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా ఆయనను పలువురు ప్రముఖులు, గ్రామస్థులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## బ్రిటిష్ గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన ధీశాలి ఉయ్యాలవాడ



**బాపట్ల, ఫిబ్రవరి 22. ప్రభాతవార్త:** బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ నిరంకుశ పాలనపై గర్జించిన తొలి తెలుగు విప్లవ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ కొనియాడారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ1857 సిపాయిల తిరుగుబాటు కంటే దశాబ్దం ముందే (184647) రాయలసీమ గడ్డపై సాయుధ పోరాట బావుటా ఎగురవేసిన ఘనత నరసింహారెడ్డికే దక్కుతుందన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం అనుసరించిన భారమైన పన్ను విధానాలు, భూసేకరణ పద్ధతులకు వ్యతిరేకంగా సుమారు 5,000 మంది రైతులతో సైన్యాన్ని నిర్మించి, వారిని గజగజలాడించారన్నారు. గిద్దలూరు వద్ద కెప్టెన్ వాట్సన్ నేతృత్వంలోని బ్రిటిష్ బలగాలను చిత్తు చేసిన వీరుడన్నారు. ఆ నాడు ఆయన ప్రదర్శించిన ధైర్యసాహసాలు తెలుగు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడ్డాయన్నారు.1847 ఫిబ్రవరి 22న బ్రిటిష్ వారు ఆయన్ను బహిరంగంగా ఉరితీసినా, ఆయన రగిల్చిన స్వాతంత్ర్య కాంక్ష ఆరిపోలేదన్నారు. నరసింహారెడ్డి త్యాగాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2017లో ప్రత్యేక తపాలా స్టాంపును విడుదల చేసిందని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టడం మనందరికీ గర్వకారణమన్నారు. నేటి యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ నారాయణ, ఆర్ఐ మోలుద్దీన్, చుండూరు సీఐ ఆనందరావు తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గోవా తరహాలో బాపట్ల తీరాభివృద్ధి

-ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌తో కలెక్టర్ బృందం భేటీ
-తీర ప్రాంత నియంత్రణ మండలి నిబంధనలే కీలకం
-మూడు రోజుల అధ్యయన పర్యటన ముగింపు.

**బాపట్ల, ఫిబ్రవరి 22. ప్రభాతవార్త:** బాపట్ల జిల్లా సముద్ర తీర ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చేపట్టిన గోవా అధ్యయన పర్యటన ముగిసింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ నేతృత్వంలోని అధికారుల బృందం శనివారం గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. దేశంలోనే ప్రముఖ పర్యాటక రాష్ట్రంగా గోవాను తీర్చిదిద్దిన విధానాన్ని, అక్కడి పర్యాటక



అనుకూల విధానాలను ఈ సందర్భంగా అధికారులు చర్చించారు.

**పర్యావరణ హితమే ముఖ్యం:** గోవా సీఎంతీర ప్రాంత అభివృద్ధిలో ఖితీర ప్రాంత నియంత్రణ మండలిఖి నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని గోవా సీఎం సూచించారు. నిబంధనల లోబడి నిర్మాణాలు చేపట్టడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని, భవిష్యత్తులో ఎటువంటి న్యాయపరమైన చిక్కులు ఉండవన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బృందం ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించి, శ్రీ వేంకటేశ్వర స్వామి వారి విగ్రహాన్ని జ్ఞాపికగా అందజేసింది. అనంతరం ఏపీ పర్యాటక శాఖ రూపొందించిన ఖికాఫీ టేబుల్ఖి పుస్తకాన్ని సీఎంకు అందించగా.. ముఖ్యమంత్రి గోవా పర్యాటక విధాన పుస్తకాన్ని కలెక్టర్ బృందానికి అందజేశారు.

**బాపట్లకు ఆదర్శం..** గోవా పర్యటనలో తాము గమనించిన ఉత్తమ విధానాలను, అక్కడి పర్యాటక మౌలిక సదుపాయాలను బాపట్ల జిల్లా తీరాభివృద్ధిలో అమలు చేస్తామని కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. పర్యటనలో మున్సిపల్ కమిషనర్ జి. రఘునాథ రెడ్డి, తహసీల్దార్ కె. గోపికృష్ణ, ఎంపీడీవో ఎం. రాజేష్ బాబు, జిల్లా పర్యాటక అధికారి అలీ అస్గర్ షేక్, ఏపీ టూరిజం ప్రాజెక్టు మేనేజర్లు శివ శరణ్, షేక్ సజిత్ తదితరులు పాల్గొన్నారు

## అనారోగ్యంతో ఉన్నవారిని పీజీఆర్ఎస్‌కు తీసుకురావద్దు



**బాపట్ల, ఫిబ్రవరి 22: ప్రభాతవార్త:** జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు సంబంధించి బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ సూచనలు చేశారు. నడవలేని స్థితిలో ఉన్నవారిని, మంచానికే పరిమితమైన రోగులను పీజీఆర్ఎస్ కార్యక్రమానికి తీసుకురావద్దని ఆయన కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరుగుతుందన్నారు.జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలు ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు లేదా నడవలేని స్థితిలో ఉన్నవారు స్వయంగా రావాల్సిన అవసరం లేదు. వారి తరపున కుటుంబ సభ్యులు లేదా ప్రతినిధులు వచ్చి అర్జీలను అందజేయవచ్చు.వివిధ మండలాల నుండి ద్విచక్ర వాహనాలపై కలెక్టరేట్‌కు వచ్చే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. భద్రతా నియమాలను పాటించడం బాధ్యతగా గుర్తించాలన్నారు.స్థానికంగానూ అవకాశం: కేవలం కలెక్టరేట్ మాత్రమే కాకుండా, ప్రతి రెవెన్యూడివిజన్కార్యాలయంలోనూ, మండల తహశీల్దార్ మరియు ఎంపీడీఓ కార్యాలయాల్లోనూ అధికారులు అర్జీలను స్వీకరిస్తారని వెల్లడించారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పై నిబంధనలను పాటిస్తూ అధికారులకు సహకరించాలని కలెక్టర్ వినోద్ కుమార్ కోరారు.

## యాక్సెస్ పాస్ కార్డులు ఎంతో ఉపయోగకరం

నిజాంపట్నం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్తః సముద్రంలో వేట చేసే మత్స్యకారులకు యాక్సెస్ పాస్ కార్డులు ఎంతో ఉపయోగమని అగ్నికుల క్షత్రియ కార్పోరేషన్ డైరెక్టర్ బి రామకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మత్స్యకారుల, అగ్నికుల క్షత్రియులు,



మత్స్యసంపదపై ఆధారపడి జీవించే వారి కోసం యాక్సెస్ పాస్ కార్డులు జారీ చేస్తున్నదని ఆయన తెలిపారు. ప్రథమంగా రాష్ట్రం నుంచి ఇరువురిని ఎంపిక చేసి ముందుగా కార్డులు జారీ చేయగా వారిలో తానొకడినన్నారు. బోటు యజమానులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే యాక్సెస్ పాస్ కార్డులు మంజూరు చేస్తారన్నారు.

## స్వర్ణ పంచాయితీ ఏర్పాటుపై శిక్షణ

**నిజాంపట్నం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్తః** ప్రతి పంచాయితీ స్వర్ణ పంచాయితీగా చేసేందుకు ప్రతి ఒక్క కార్యదర్శి కృషి చేయాలని ఎంపిడిఓ నాగలక్ష్మి సూచించారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో కార్యదర్శుల




శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని మాట్లాడుతూ స్వంత నిధుల సమీకరణ, స్వంత నిధులను ఎలా సద్వినియోగం చేసుకోవాలో తదితర అంశాలలో శిక్షణ ఇస్తున్నారన్నారు. కార్యదర్శులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిఎస్‌డబ్లు ్యఎస్ ఎంపిడిఓ శివకుమార్, ఇఓపిఆర్‌డి కుమారస్వామి, ఎపిఎం మస్తాన్‌రావు, నిజాంపట్నం పంచాయితీ కార్యదర్శి మోడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**నిజాంపట్నం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్తః** ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండి కుటుంబ పోషణ చేయలేని స్థితిలో ఉన్న చింతా రామరాజు తనతో చిన్నపుడు 1988-89లో 10వ తరగతి చదువుకున్న మిత్రులను సహాయం అడిగాడు.



తన కుమార్తె వివాహానికి చేయూతనివ్వండి అని అడగ్గా అందరూ సహాయం చేద్దాం అనుకున్నారు. కాని విధి వక్రీకరించి రామరాజు మరణించాడు. దీంతో బాధపడ్డ మిత్రులు మరణించిన మిత్రుని కుమార్తె వివాహానికి రూ.75,045లు సేకరించారు. అందులో నుంచి తక్షణ సాయంగా రూ.15వేలు మృతుని కుమార్తె శివమణికి అందించారు. మిగిలిన నగదు శివమణి వివాహ సమయంలో అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో 10వ తరగతి టైటాన్స్ 1988-89 మిత్రులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే చర్యలు

**కొల్లిపర, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మద్యం సేవించి వాహనాలను నడిపితే చర్యలు తీసుకుంటామని కొల్లిపర ఎస్ఐ ప్రసాద్ చెప్పారు.ఆదివారం మండలంలోని కొల్లిపర,మున్నంగి,వల్లభాపురం గ్రామాలలో వాహనాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే వాహనాన్ని సీజ్ చేసి జరిమానా విధిస్తామని తెలిపారు.విధిగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలను నడపాలన్నారు.18 సంవత్సరాల వయసు లోపు మైనర్లు వాహనాలను నడిపితే వాహన యజమానులు,తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ప్రసాద్ హెచ్చరించారు.సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.ఈ తనిఖీ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా వినాయకుని బ్రహ్మోత్సవాలు

**కొల్లిపర, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మండలంలోని వల్లభాపురంలో శ్రీ వినాయక స్వామి దేవాలయంలో ఆదివారం 114వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఆలయ ధర్మకర్త ఇందుశేఖర్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు.భక్తులతో విశ్వశాంతి హోమం కార్యక్రమాన్ని వేద ప్రచారకులు గొడవర్తి కోటేశ్వరరావు జరిపించారు.విఘ్నేశ్వరునికి అభిషేక పూజలు నిర్వహించారు.గ్రామంలో శ్రీ వినాయకస్వామి ఉత్సవ విగ్రహాన్ని



ఊరేగించారు.భక్తులు హారతినిచ్చి తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. విలువిద్యను ప్రదర్శించిన ఆరుష్‌రెడ్డిని పలువురు అభినందించారు.శ్రీ వినాయక స్వామి బ్రహ్మోత్సవాలలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కొత్త పెన్షన్ల సమాచారం అవాస్తవం

**కొల్లిపర, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఎంపిడివో విజయలక్ష్మి చెప్పారు.ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆన్‌లైన్ పిడిఎఫ్ పత్రికలలో వచ్చిన కథనంలో వాస్తవం లేదన్నారు.ఉన్నతాధికారుల సూచనల మేరకు వెల్ఫేర్ అసిస్టెంట్స్ మాత్రం వారి దగ్గర ఉన్న అర్హుల జాబితాను సిద్ధం



చేసుకోవాల్సిందిగా సూచించామని తెలిపారు.నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎవరూ స్వర్ణగ్రామ కార్యాలయాలకు రావద్దని విజయలక్ష్మి తెలియజేశారు.మండలంలోని వెల్ఫేర్ అసిస్టెంట్స్ కొత్త పెన్షన్ల దరఖాస్తులను ఎవరి వద్ద నుంచి తీసుకోవద్దని ఆమె స్పష్టం చేశారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం

రేపల్లె, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:పట్టణంలో సోమవారం ప్రారంభంకానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.శ్రీ చైతన్య,ఆర్సి,ఝాన్సీ లక్ష్మీభాయి,ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయి.ఈ నెల 23వ తేదీ నుండి మార్చి 24వ తేదీ వరకు ఇంటర్ ప్రథమ,ద్వితీయ సంవత్సరం రెగ్యులర్,బ్యాక్‌లాగ్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయి.పరీక్షకు హాజరుకావాల్సిన విద్యార్థులు గంట సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రం వద్దకు రావాల్సి ఉంటుందని అధికారులు ప్రకటించారు.ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రం లోపలకు అనుమతించమని స్పష్టం చేశారు.మొబైల్, స్మార్ట్‌వాచ్, కాలిక్యులేటర్‌లకు అనుమతి లేదు.విద్యార్థుల కోసం అదనపు బస్సు సర్వీసులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.మరిన్ని వివరాల కోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ (18004251531)నెంబరుకు సంప్రదించాల్సి ఉంటుంది.

## శ్రీ కంఠ శివాచార్య జయంతి మహోత్సవాలు

**తెనాలి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 22,(ప్రభాతవార్త):** పట్టణంలోని బుర్రిపాలెం రోడ్డులో వేంచేసిన శ్రీ ఓంకారేశ్వర స్వామి దేవస్థానం నందు ఆదివారం శ్రీ కంఠ శివాచార్య జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శైవాగమ పండితులు మామిళ్ళపల్లి మృత్యుంజయ ప్రసాద్



అర్చక స్వామి ఆధ్వర్యంలో, దేవస్థానం కార్యనిర్వహణాధికారి హరిప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన ఈ ఉత్సవాల్లో,గురు మండలార్చన,వేదిక అర్చన, రుద్రహోమం,పూర్ణాహుతి కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అర్చకులు శైవాగమ విశిష్టతను, ప్రాముఖ్యతను,భక్తులకు వివరించారు. అనంతరం అర్చకులను దేవస్థాన పెద్దలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణం మరియు పరిసర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేశారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**చెరుకుపల్లి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం కావూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వద్ద ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. ఎస్సై టి అనిల్ కుమార్ వివరాలు ప్రకారం తుమ్మలపాలెం పంచాయతీ జొన్నలగడ్డ వారి పాలెం గ్రామానికి చెందిన మొవ్వ ముత్యాలరావు (47) తండ్రి బసవయ్య బాపట్ల నుంచి జొన్నలగడ్డ వారి పాలెం వెళుతుండగా చెరుకు పల్లి నుండి బాపట్ల వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముత్యాలరావు అక్కడికక్కడే మృతిచెందాడు. నేషనల్ హైవే నుండి తన గ్రామం వైపు మోటార్ బైక్ పై టర్న్ అవుతుండగా వాహనం ఢీ కొనడం జరిగింది. మరొక రెండు నిమిషాల్లో తన ఇంటికి చేరుకుంటాడు అనుకున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం స్థానికులను తీవ్రంగా కలచివేసింది. మృతుడికి భార్య, కుమారుడు ,కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోధన స్థానికులను సైతం చలింప చేసింది. జరిగిన ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు.



## చంద్రబాబుకు ఘన స్వాగతం పలికిన తెదేపా ఎమ్మెల్యే,నేతలు

**వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** గుంటూరు గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళన కార్యక్రమానికి విచ్చేయనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర కమ్యూనికేషన్ శాఖామంత్రి జ్యోతిరాధిత్య సింధియా, మరో కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ లను కాజా టోల్ ప్లాజా వద్ద ప్రత్తిపాడు శాసనసభ్యులు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు తన అనుచర గణంతో ఆదివారం



మర్యాద పూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికారు. అనంతరం కాజా టోల్ ప్లాజా నుండి గుంటూరు నగర శివారు బొమ్మిడాల నగర్లోని శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక సొసైటీ ప్రాంగణం వరకు భారీ ర్యాలీతో ఊరేగింపుగా టిడిపి పార్టీకి అనుకూలంగా, వైసీపీకి వ్యతిరేకంగా నినాదాలు పలుకుతూ, పైవారిని తోడ్కొని వచ్చారు. భారత్ నెట్ కు సంబంధించి ఒప్పంద పత్రాలపై సింధియాతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకం చేసినట్లు నేతలు తెలిపారు. తపాలా సేవా మూర్తులకు ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రుల చేతుల మీదుగా సన్మానించడం జరిగిందని వివరించారు. ఈ ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జ్యోతి రాధిత్య సింధియా మాట్లాడుతూ తపాలా వ్యవస్థపై గ్రామ ప్రజలకు ఇంకా విశ్వాసం ఉందని, గ్రామీణ డాక్ సేవక్ ల సేవలు మర్చిపోలేమని, గ్రామ పెద్ద, డాక్ డాక్ సేవక్ లను గ్రామీణులు ఎప్పటికీ మర్చిపోలేరన్నారు. గ్రామీణ డాక్ సేవకుల పిల్లలకు కేంద్రీయ విద్యాలయాల్లో సీట్లు వచ్చేలా చేసానని, తపాలా శాఖలో పార్సిల్ వ్యవస్థ మరింత బలోపేతం కావాలని, పార్సిల్, మెయిల్ నెట్వర్క్ లో వేగం పెంచాలని సూచించారు. గ్రామీణ డాక్ సేవక్ లకు ఈస్కూటర్లు ఇచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ వికసిత్ భారత్ సాధనలో గ్రామీణ డాక్ సేవక్ లు ముందుండాలని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేసే మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరినట్లు తెలిపారు. సూపర్ సిక్స్ పథకాల అమల్లో గ్రామీణ డాక్ సేవక్ ల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మర్రి సాంబశివరావు, మీడియా కోఆర్డినేటర్ గింజపల్లి వెంకటేశ్వరరావు, టిడిపి సీనియర్ నేత వీరిశెట్టి జగన్మోహన్రావు, దారా వెంకట్రావ్, వివిధ గ్రామాల సర్పంచ్ లు, ఎంపీటీసీ సభ్యులు, బూత్ కన్వీనర్లు, కూటమి నాయకులు,అభిమానులు,కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## పెండ్లీ పేరుతో మోసంచేస్తున్న వ్యక్తి అరెస్ట్ చేసిన త్రీటౌన్ పోలీసులు

**తెనాలి టౌన్,ఫిబ్రవరి22,(ప్రభాతవార్త):** మ్యాట్రిమోనీ ద్వారా మహిళలతో పరిచయం పెంచుకొని వారిని మోసగిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన తెనాలి త్రీటౌన్ పోలీసులు. పోలీసుల కథనం ప్రకారం, కొల్లూరు మండలం కొత్తూరు లంక గ్రామానికి చెందిన అరవపల్లి వంశీ అనే వ్యక్తి మ్యాట్రిమోని ద్వారా పెళ్లి కాని యువతులను తన మాయ మాటలతో, తనకు వివాహం కాలేదని తను



కోటీశ్వరుడినని,మోసపూరిత మాటలతో వారిని నమ్మించి వారి వద్ద నుండి నగదు బంగారంతో తీసుకొని, వారిని మోసం చేస్తున్నాడు.ఈ క్రమంలోనే తెనాలి పట్టణానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటున్న ఒక మహిళ వద్ద లారీలు కొంటున్నానని, మళ్లీ 10,15 రోజుల్లో తిరిగి ఇచ్చేస్తానని,ఆమెని పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఆమె వద్ద నుండిరు.12.20 లక్షలు వసూలు చేశాడు. అయితే అతని ప్రవర్తనతో తాను మోసపోయినట్లు గ్రహించి సదరు మహిళ త్రీ టౌన్ పోలీసులను ఆశ్రయించగా సీఐ సాంబశివరావు ఆధ్వర్యంలో నిందితుడిని అరెస్టు చేయడం జరిగిందని,అనంతరం కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ తెలిపారు.

## నూతన గృహ ప్రవేశ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే

వట్టిచెరుకూరు, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త : **ప్రత్తిపాడు నియోజకవర్గం,** గుంటూరు రూరల్ మండలం, లాల్ పురం గ్రామానికి చెందిన కాటూరి శ్రీనివాసరావు, రమాదేవి దంపతుల నూతన గృహప్రవేశ వేడుక కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ శాసన సభ్యులు, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డా.బూర్ల రామాంజనేయులు ఆదివారం పాల్గొన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో



పాల్గొని స్థానిక ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ, కాటూరి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు దేవ దేవుని ఆశీస్సులు కలగాలని మనస్ఫూర్తిగా కోరారు. కుటుంబ సభ్యులందరు అనురాగం నిండిన ఆనందంతో కలకాలం నిలవాలని నూతన గృహ ప్రవేశ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శాసనసభ్యులను రమాదేవి కుటుంబ సభ్యులు శాలువతో ఘనంగా సత్కరించి అభినందించారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన జీవితానికి ఒకరోజు కేటాయిద్దాం

## హ్యాపీసండే కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల పిలుపు

**తెనాలి టౌన్,ఫిబ్రవరి22,(ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు హ్యాపీసండే కార్యక్రమమును ఆదివారం స్థానిక చినరావూరు పార్కు వద్దని హ్యాపీసండే కార్యక్రమాన్ని పురపాలక సంఘ ఆధ్వర్యంలో నిర్వహించారు.గతంలో నిర్వహించిన కార్యక్రమాన్ని పురపాలక సంఘములో తిరిగి పునఃరుద్ధరించారు.ఆదివారం స్థానిక చినరావూరు పార్క్ వద్ద ఏర్పాటుచేసిన హ్యాపీసండే కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పట్టణానికి చెందిన పలువురు ప్రజలు,పాఠశాలల విద్యార్థులు,పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలను, క్రీడలను అందరూ వీక్షించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మాత్యులు నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ,ప్రజల్లో ఆరోగ్యం పెంపొందించే విధంగా హ్యాపీసండే కార్యక్రమాన్ని పునః ప్రారంభించినట్లు చెప్పారు.గ్రామీణ వాతావరణంలో గతంలో నాటికలు, నృత్య కళలు యువతకు ప్రేరణగా నిలిచేవన్నారు.కళాకారులకు కలలకు తెనాలి




పెట్టింది పపేరని, దానిని మ్నన కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు.తెనాలి వైభవానికి ఏ మాత్రం తీసిపోకుండా రానున్న రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు క్రీడలను ప్రోత్సహించేవిధంగా హ్యాపీసండే కార్యక్రమాన్ని కొనసాగిస్తా మన్నారు. అందరూ ఇటువంటి కార్యక్రమాల్లో భాగ స్వాములు కావాలని కోరారు.. మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.యేసు బాబు మాట్లాడుతూ,ప్రతినెలా రెండు,నాలుగు ఆదివారాల్లో ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.యోగ, జ్ఞానం,నడక ,సైక్లింగ్, ఆటలు,కథలు,చిత్రలేఖనం, స్వచ్ఛభారత్, మొక్కలు నాటడం,సంగీతం, సాహిత్యం, జానపద,నృత్య, కళాప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సండేహ్యాపీ సండే కార్యక్రమంలో పాల్గొని తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని కోరారు. పాఠశాల నుండి విద్యార్థులను కార్యక్రమాన్ని తీసుకువచ్చి సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయులకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మానసరెడ్డి,మున్సిపల్ రెవిన్యూ ఆఫీసర్ రాంప్రసాద్,మున్సిపల్ మేనేజర్ జైకర్,మెప్మా సీఎం ఎం విజయ కుమారి, పలువురు నాయకులు,పలు పాఠశాల విద్యార్థులు,స్థానిక ప్రజలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జర భద్రం..!

## అప్రమత్తంగా లేకుంటే అంతే సంగతులు..

5వపేజీ తరువాయి



నగర ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని ప్రతి ప్రాంతంలో ఒక్కొక్క రోడ్డులో పది కుక్కల పైగా సంచరించటం, హఠాత్తుగా రోడ్లపై ప్రయాణించే ప్రజలు... పసి పిల్లల పైకి వెంబడించి ఇష్టం వచ్చినట్టు ఎక్కడ దొరికితే అక్కడ పట్టుకొని కండలు పీకటంతో వణికి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతీ 24 గంటల్లో వీధి కుక్కల కాటు భారీన పడిన ఎంతోమంది ఘటనలు వెలుగు చూస్తున్నాయి. వీధి కుక్కల నియంత్రణలో కార్పొరేషన్ అధికార యంత్రాంగం నిస్సహాయ స్థితిలో ఉందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కార్పొరేషన్ అధికార యంత్రాంగం వీధి కుక్కల నియంత్రణలో పూర్తిస్థాయిలో విఫలం చెందారని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.. అయితే ఈ మధ్యకాలంలో వీధి కుక్కల దాడిలో అనేక మంది ప్రాణాలు కోల్పోవడం, కుక్క కాటుకు గురై వర్షాల కారణంగా పిచ్చి పట్టినట్టు ప్రవర్తించడం వంటి ఘటనలు వెలుగు చూడటంతో సుప్రీంకోర్టు ఇటీవల కాలంలో కొత్తగా మార్గదర్శకాలు ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. వీధి కుక్కలకు బహిరంగ ప్రాంతాల్లో ఆహారం అందించవద్దని అటువంటి వారిని గుర్తించి భారీ పెనాల్టీ వేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే అవి పట్టించుకున్న దాఖలాలే కనిపించడం లేదు.అప్రమత్తంగా లేకుంటే అంతే సంగతులని,పిచ్చి పట్టిన కుక్కలు నగర వీధుల్లో సంచారం బాగా పెరిగిందని కూడా నగరవాసులు ఇవాళ భయాందోళన వ్యక్తం చేస్తున్నారుఆ కుక్కల కాటు పడితే చిన్న పెద్ద తేడా అనేది లేకుండా ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వీధి కుక్కల కాట్లుతో నగర వాసులు ఉక్కిరి బిక్కిరి అయ్యే పరిస్థితి నగరంలో జరుగుతుంది.డాగ్ సెల్టర్ జోన్స్ ఏర్పాటులో తాసారం... కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుందని నగర ప్రజలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఒక నిర్ణయం తీసుకోవాలని, ఇంకా ఎంతమంది ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## పిజిఆర్ఎస్ కార్యక్రమం యధావిధి

**గుంటూరు క్రైమ్, ఫిబ్రవరి22,ప్రభాతవార్త:** ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమం నేడు యధావిధిగా నిర్వహించబడును.కావున ప్రజలు మీ యొక్క సమస్యలను గ్రీవెన్స్ ద్వారా జిల్లా అధికారులకు తెలియపరచగలరు.

## బీసీల హక్కుల కోసం మరో కురుక్షేత్రం తప్పదు

**-30 రోజుల్లో 5 డిమాండ్లు నెరవేర్చకపోతే ఆమరణ దీక్ష**

**-సామాజిక న్యాయానికి ప్రతీకగా శ్రీకృష్ణజాంబవతి కల్యాణం**

**- బీసీవై అధినేత బోడె రామచంద్రయాదవ్**

**మంగళగిరి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

భారతచైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో విజయవాడ గుంటూరు హైవేలోని నాగార్జున యూనివర్సిటీ ఎదురు "పూలేఅంబేద్కర్‌మండల్



కర్పూరి ఠాకూర్ ప్రాంగణం"లో ఆదివారం నాడు జరిగిన చారిత్రాత్మక "బీసీ సింహగర్జన" మహాసభ జరిగింది. ఈ సభ వేదికగా, బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ ప్రభుత్వానికి 30 రోజుల గడువు విధిస్తూ, తమ ఐదు ప్రధాన డిమాండ్లను నెరవేర్చకపోతే ఏప్రిల్ 11న, మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి రోజున విజయవాడ నడిబొడ్డున ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు.

**సామాజిక న్యాయానికి ప్రతీకగా శ్రీకృష్ణ జాంబవతి కల్యాణం**

బీసీల అభివృద్ధికి కృషి చేసిన మహనీయులను స్మరించుకుని, బీసీ కుల దేవతలకు ఆరాధనలు నిర్వహించారు.అనంతరం, సామాజిక చైతన్యానికి, కులాంతర వివాహాలకు ఆనాడే నాంది పలికిన శ్రీకృష్ణుడి ఆశయాలను స్మరించుకుంటూ, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా శ్రీకృష్ణజాంబవతిల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో అందరికీ అందుబాటులో ఉండే ప్రాంతంలో శ్రీకృష్ణ జాంబవతిల ఆలయాన్ని నిర్మిస్తానని ప్రకటించారు.

**ప్రభుత్వాల నిర్లక్ష్యంపై రామచంద్రయాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.**

"రాష్ట్రంలోని 1124 బీసీ హాస్టళ్లలో ఒక్కదానికి కూడా సొంత భవనం లేదు. ఒక్కో గదిలో 2030 మందిని పశువుల్లా కుక్కుతున్నారు. రోజుకు కేవలం 13 రూపాయల మెస్ చార్జీలతో నాణ్యత లేని ఆహారం పెడుతున్నారని ఆరోపించారు. బీసీ రక్షణ చట్టం తక్షణ అమలు చేయాలని రామచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. ఈ ఐదు డిమాండ్లను నెరవేర్చడానికి ప్రభుత్వానికి 30 రోజులు సమయం ఇస్తున్నాను. లేనిపక్షంలో, ఏప్రిల్ 11న పూలే జయంతి రోజున విజయవాడలో ఆమరణ నిరాహార దీక్షకు దిగుతాను. ఇది మరో కురుక్షేత్రానికి నాంది," అని రామచంద్రయాదవ్ హెచ్చరించారు.

## నగరంలో సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజా ఫిర్యాదుల వేదిక : నగర కమిషనర్



**గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 22, (ప్రభాతవార్త) :** గుంటూరు నగరంలో ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని నగర కమిషనర్ కే మయూర్ అశోక్ తెలిపారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను సేకరించడం జరుగుతుందని ఆయన వివరించారు. కార్పొరేషన్ లోని అన్ని విభాగాల అధిపతులతో కలిసి ప్రజలనుంచి అర్జీలు స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రజల సమస్యలు సత్వరం పరిష్కరించడం కోసమే ప్రభుత్వం ప్రతి సోమవారం అన్ని ప్రభుత్వ శాఖలలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించిందని ఆయన వెల్లడించారు. ఈ అవకాశాన్ని గుంటూరు నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ కోరారు.

## చంద్రుని వెలుగులో విజ్ఞాన విహారం -స్టెమ్ స్కూల్ లో అద్భుత స్టార్ గేజింగ్ వేడుక

**గుంటూరు విద్య, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త,:** గుంటూరులోని స్టెమ్ స్కూల్ లో నిర్వహించిన"స్టార్ గేజింగ్ ప్రోగ్రామ్" అద్భుత విజయాన్ని సాధించింది. సుమారు 500 మందికి పైగా విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని రాత్రి ఆకాశాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు.ఈ కార్యక్రమంలో శక్తివంతమైన డాబ్సోనియన్ టెలిస్కోప్ ద్వారా చంద్రుడిని స్పష్టంగా పరిశీలించే అవకాశం అందించారు. చంద్రుని ఉపరితల నిర్మాణం, క్రేటర్లు మరియు ఇతర విశేషాల గురించి విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు వివరించి తెలియజేశారు. రాత్రి ఆకాశమే ఒక ప్రత్యక్ష తరగతి గదిగా మారి, విజ్ఞానాన్ని అందించింది.తల్లిదండ్రుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన క్విజ్ కార్యక్రమం ఉత్సాహాన్ని మరింత పెంచింది. విజేతలకు బహుమతులు ప్రదానం చేయడంతో కార్యక్రమం మరింత ఆకర్షణీయంగా మారింది.ఈ స్టార్ గేజింగ్ కార్యక్రమం విద్యార్థుల్లో ఆసక్తి, ఆనందం మరియు అంతరిక్ష విజ్ఞానంపై లోతైన అభిరుచిని పెంపొందించింది.

## విఐటిలో ముగిసిన విటోపియా-2026 ఉత్సవాలు

**తుళ్ళూరు,ఫిబ్రవరి 22,ప్రభాతవార్త :** జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను అధిగమిస్తూ ముందుకు సాగాలని అర్జున అవార్డు గ్రహీత జ్యోతి యర్రాజీ అన్నారు.ఆదివారం రాజధాని అమరావతిలోని విఐటి విశ్వవిద్యాలయంలో




విటోపియా-2026 వార్షిక క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జ్యోతి యర్రాజీ బహుమతులు అందజేశారు.5కిమీ మారథాన్‌లో పాల్గొని విద్యార్థులను ఉత్తేజపరిచారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవితంలో విజయం సాధించలాంటే సవాళ్ళను,స మస్యలను ఆత్మసైర్యంతో అధిగమిస్తూ ముందుకు సాగాలని,వెనకడుగు వేయవద్దన్నారు.ఒక సామాన్య కుటుంబం నుండి వచ్చి ఆసియాన్ గేమ్స్‌లో స్వర్ణం సాధించే స్థాయికి ఎదిగే క్రమంలో అనేక ఒడిదుడుకులు ఎదురైనా మనోధైర్యంతో నిలబడ్డానని అన్నారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ (ఇన్‌చార్జ్) డాక్టర్ అరుల్మోళివర్మన్ మాట్లాడుతూ,విద్యార్థులు విద్యతోపాటు క్రీడా,సాంస్కృతిక కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం అవసరమన్నారు.జ్యోతి యర్రాజీని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు తమ జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను అధిగమిస్తూ లక్ష్యాలను సాధించాలని చెప్పారు .సాయంత్రం ప్రో-షోలో మోహన భోగరాజు,అబ్దుల్ వాహబ్ బ్యాండ్,డి.జె. నోటోరియస్ సంగీత విభావరీలు అందర్ని అలరించాయి.కార్యక్రమంలో విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి,డాక్టర్ గోపికృష్ణన్ (విటోరియా కన్వీనర్),డాక్టర్ ఖాదీర్ పాషా (స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్),విద్యార్థులు ,ఉపాధ్యాయులు, ప్రత్యేక ఆహ్వానితులు, అతిథులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి

**గుంటూరు క్రైమ్, ఫిబ్రవరి22,ప్రభాతవార్త:**భారత ప్రథమ స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు.భారత స్వాతంత్ర సంగ్రామ చరిత్రలో ఆంగ్లేయుల గుండెల్లో నిద్రపోయిన ధీశాలి, రేనాటి సూర్యుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 1857 సిపాయిల



తిరుగుబాటు కంటే ముందే, 1846లోనే బ్రిటిష్ పాలకుల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసిన గొప్ప వీరుడు. ఆయన తెలుగు నేల గర్వించదగ్గ వీరుడు నరసింహారెడ్డి, ఆంగ్లేయుల పన్నుల విధానాన్ని,రైతులపై జరుగుతున్న అన్యాయాలను ఎదిరించారు. వేలాది మంది రైతులతో సైన్యాన్ని నిర్మించి, గెరిల్లా యుద్ధ తంత్రంతో బ్రిటిష్ సైన్యాన్ని వణికించారు. చివరకు దేశద్రోహుల కుట్రల వల్ల పట్టుబడిన ఆయనను, 1847 ఫిబ్రవరి 22న కోయిలకుంట్ల వద్ద ఆంగ్లేయులు బహిరంగంగా ఉరితీశారు. ప్రజల్లో భయభ్రాంతులు కలిగించడానికి ఆయన తలను సుమారు 30 ఏళ్ల పాటు కోట గుమ్మానికి వేలాడదీశారంటే ఆయన పట్ల ఆంగ్లేయులకు ఎంతటి భయం ఉండేదో అర్థం చేసుకోవచ్చు.ఈ కార్యక్రమం గుంటూరు ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలు మేరకు గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి ఆర్ఎస్ఐ సుబ్బారెడ్డి,ఆర్ఎస్ఐ సుబ్బారావు,సిబ్బంది పూలమాలలు వేసి చిత్రపటానికి ప్రత్యేక నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన త్యాగాలను స్మరిస్తూ ఆర్ఎస్ఐ సుబ్బారెడ్డి,ఆర్ ఎస్ ఐ సుబ్బారావు ప్రసంగించారు."దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం మన బాధ్యత." అని తెలియజేశారు.

## దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కీలకం

**- ప్రొఫెసర్ దివ్యతేజో మూర్తి - ముగిసిన వారంరోజుల ఎన్ఎస్ఎస్ శిభిరం**

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఫిబ్రవరి22, ప్రభాతవార్త:** భారతదేశానికి యువత వెన్నెముకగా ఉందని, వారి భాగస్వామ్యం దేశాభివృద్ధికి కీలకమని ఏఎన్‌యు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య వి.దివ్యతేజోమూర్తి అన్నారు. గడిచిన వారం రోజులుగా వర్సిటీ దత్తత గ్రామాలుగా ఉన్న కాజా, వెంకటరెడ్డి పాలెం గ్రామాలలో ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్




యూనిట్లు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. శిబిరం ముగింపు కార్యక్రమానికి దివ్యతేజోమూర్తి పాల్గొన్నారు. ఆయన వాలంటీర్లను ఉద్దేశించిమాట్లాడారు. యువత సేవాగుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు జ్ఞాపికలు అందజేశారు. ప్రోగ్రాం ఆఫీసర్లు వారం రోజులు ఎంతో శ్రమించి శిబిరాన్ని నిర్వహించారని వారిని అభినందించారు. వారం రోజులుగా గ్రామాల్లో అక్షరాస్యత, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవ, ప్రభుత్వ పథకాల వివరణ, సేవా గుణాలు, నైపుణ్యాల పెంపుదల, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత వంటి అంశాలపై ఇంజనీరింగ్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సునీత, డాక్టర్ఏజెవి.రాధిక, డాక్టర్ సుమలతలు గ్రామస్థులకు, యువతకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి.సుధీర్‌కుమార్ సందర్శించారు. ఆయన వాలంటీర్లను ఉద్దేశించి సమాజసేవ, వ్యక్తిత్వ వికాసం,సామాజిక విలువలు పెంపొందించుకోవాలని సూచించారు.

## ఘనంగా సంగడిగుంట సిమ్స్ మై స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

**గుంటూరు విద్య ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** సిమ్స్ మై స్కూల్, సంగడిగుంట బ్రాంచ్ 7వ వార్షికోత్సవ వేడుకలు సిమ్స్ కళాశాల ఆవరణంలో అంగరంగ వైభవంగా జరిగాయి . సిమ్స్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ డైరెక్టర్ భీమనాదం భరత రెడ్డి మరియు సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్




డాక్టర్ బి.శివ శిరీష గారినేతృత్వంలో ఈ వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సినీ రచయిత అనంత శ్రీరామ్ (మూవీ లిరిసిస్ట్), సి ఎస్ బిఐఎస్ అకాడమీ వ్యవస్థాపకులు చైర్పర్సన్ ఎం . బాలలత హాజరయ్యారు. ఈ సందర్భంగా సిమ్స్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ డైరెక్టర్ భీమనాధం భరత్ రెడ్డి మాట్లాడుతూ లాస్ట్ ఇయర్ శీలీది ఎగ్జామ్స్ లో ఉత్తమ ఫలితాలు అందాయి అన్నారు, సిమ్స్ మై స్కూల్ ప్రతి విద్యార్థి కి చదువు చెప్పేటప్పుడు భరత్ రెడ్డి సార్ కి పాఠం చెప్పినట్టు భావించి చదువు చెప్పాలని మాట్లాడారు,అలాగే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి అనంత శ్రీరామ్ గారు మాట్లాడుతూ నాకంటే,నా మాటకంటే నా పాట తో నన్ను నేను పరిచయం చేసుకుంటున్నాను. నేను చెప్పబోయే మంచి మాటలు మీచేత చెప్పిస్తాను అని మంచి పాటలు పాడి పిల్లలు చేత దాని మీనింగ్ చెప్పించారు. లైఫ్ లో ముందుకు రావడం అంటే జీవితంలో ముందుకు రావాలి అని అనేక తెలుగు సూపర్ హిట్ పాటలు పాడి విద్యార్థులను అలరించారు. ఈ రోజునుంచి మీ సంస్థ లు అన్ని దినదినాభి వృద్ధి చెందాలని అని కొనియాడారు. అలాగే ఇంకొక ముఖ్య అతిధి లి. బాల లత గారు మాట్లాడుతూ సిమ్స్ మై స్కూల్లో జరిగే వార్షికోత్సవానికి రావడం ఎంతో సంతోషంగా ఉంది అని అన్నారు,ఈ స్కూల్ లో చదువుతున్న విద్యార్థిని,విద్యార్థులు ముందు ముందు అన్ని రంగాలలో ఉత్తమ మరియు ఉన్నత చదువులు చదవాలి అని మాట్లాడారు. విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మీ చిన్నారులను క్రమ శిక్షణ,విద్య రంగంలో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాలకు ఎంత బాధ్యత ఉందో అలాగే విద్యార్థి తల్లితండ్రులకు కూడా బాధ్యత ఉంది అని మాట్లాడారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సిమ్స్ మై స్కూల్ యాజమాన్యం చేస్తున్న కృషి ఎనలేని దని కొనియాడారు. భారత దేశ భవిష్యత్తు రానున్న రోజులలో విద్యావంతుల భుజస్కం ధాలపై ఉందని భావి భారత పౌరులను తీర్చిదిద్దటంలో సిమ్స్ మై స్కూల్ ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు .సిమ్స్ విద్యాసంస్థల సెక్రెటరీ కరస్పాండెంట్ డాక్టర్ శివ శిరీష గారు మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరంలో ఉన్నతమైన విద్యను అందించడమే మా లక్ష్యం అని సిమ్స్ మై స్కూల్ యాజమాన్యంపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను వారి పిల్లలకు ఉత్తమ క్రమశిక్షణ కలిగిన విద్యను అందిస్తూ నిజం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలలో ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థి,విద్యార్థినులు హాజరైన అతిథుల చేతులమీదుగా బహుమతులు అందుకున్నారు.ఇంకా ఈ కార్యక్రమంలో సిమ్స్ మై స్కూల్ ప్రిన్సిపల్స్, ఉపాధ్యాలు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వేడుకలు ఆశాంతం ఉత్సాహం ఉల్లాసం ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. పిల్లల కేరింతలతో ఆహ్లాదకర వాతావరణంలో ముచ్చట గొలిపే చిన్నారుల మధ్య వేడుకలు అత్యంత ఆనందభరితంగా జరిగాయి.

## ఘనంగా ఎల్ఐసి ఏజెంట్స్ లియాఫీ 30 వ వార్షికోత్సవ వేడుకలు

**గుంటూరు విద్య ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** ఎల్ఐసి ఏజెంట్స్ లియాఫీ 30వ వార్షికోత్సవ వేడుకలు స్థానికంగా ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి 706 బ్రాంచ్ అధ్యక్షులు పులివర్తి సుబ్బారావు అధ్యక్షత వహించారు. 30 సంవత్సరాల పండుగ వేడుక గురించి ఎల్ఐసి ఐకమత్యమే లక్ష్యంగా పనిచేయాలని పులివర్తి సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఆల్ ఇండియా లియాఫీ జనరల్ సెక్రెటరీ బి. మార్కండేయులు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఏజెంట్ల సంక్షేమం అభివృద్ధి గురించి మార్కండేయులు మాట్లాడారు. ఎల్ఐసి భద్రతకు ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక గురించి వివరించారు. ఎల్ఐసి ఏజెంట్ ల కు గ్రూప్ ఇన్సూరెన్స్ ఎలా సాధించాలో తెలియజేశారు. ఏజెంట్లకు కమిషన్ పెంచాలని, గ్రాడ్యుటీ పది లక్షలకు పెంచాలని తదితర ముఖ్య అంశాలను పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు తీర్మానాలను ఆమోదించారు. ఎల్ఐసి లియాఫీ గొప్పతనం గురించి వివరించారు. ఆల్ ఇండియా ట్రెజరర్ ఎంకే షా,




మచిలీపట్నం డివిజన్ ట్రెజరర్ పసుమర్తి జగన్నాథంలు మాట్లాడారు. డివిజన్ వైస్ ప్రెసిడెంట్ పల్నాటి భావన్నారాయణ మాట్లాడుతూ ఏజెంట్ల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మరి కొంతమంది నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో పులివర్తి సుబ్బారావు బ్రాంచ్ అభివృద్ధికి పాటు పడతానని హామీ ఇచ్చారు. జగదీష్ మాట్లాడుతూ పవిత్రమైన ఆశయంతో ఐక్యత విజయ పదం మార్గంలో లీఆఫీ నడవాలని తెలిపారు. ట్రజరర్ శ్రీనివాసరావు అందరికి స్వాగతం పలుకుతూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆల్ ఇండియా లియాఫీ జనరల్ సెక్రెటరీ బి మార్కండేయులు కు, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ పల్నాటి భావనారాయణకి, జి శ్రీనివాసరావు, వి వెంకటేశ్వరరావు, గుంటూరు పరిశుద్ధ రావు, పి కోటేశ్వరరావు షేక్ కాసిం వలి పులివర్తి సుబ్బారావు జగదీష్ , గోవిందు శ్రీనివాసరావు, సిహెచ్ వెంకటేశ్వరరావు తదితరులకు సన్మానం జరిగింది. నిర్వాహకులు సన్మాన గ్రహీతలకు పూలమాలలు వేసి శాలువాను కప్పి మెమెంటోలతో అభినందనల వర్షం కురిపించారు. బ్రాంచ్ మేనేజర్ బి ఎం జే యు ఎస్ వి సురేష్ కు ఏజెంట్లు అందరూ కలిసి సత్కారం చేశారు. కార్యక్రమంలో భాగంగా లియాఫీ జిందాబాద్ ఏజెంట్ ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. .పెద్ద సంఖ్యలో ఏజెంట్లు మిత్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మాతృభాష సంరక్షణ జాతి బాధ్యత అవ్వాలి

**గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 22,ప్రభాతవార్త :** ఏప్రాంత సంస్కృతి సాంప్రదాయాలైనా అక్కడి భాషతోనే నిలుస్తాయని,ప్రస్తుత పరిస్థితుల్లో మాతృభాషల సంరక్షణ జాతి తమ బాధ్యతగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న భాషాభిమానులు,కవులు,గాయకులు మాట్లాడుతూ అన్నారు.అవగాహన సంస్థ కార్యాలయంలో అంతర్జాతీయ మాతృబాషా దినోత్సవ కార్యక్రమం జరిగింది.కార్యక్రమలో తెలుగు భాషా పరిరక్షణ కమిటీ కన్వీనర్,సంగీత విద్వాంసులు,గాయకులు వి.ఎస్.ఎన్.మల్లేశ్వరరావు మాట్లాడుతూ భాషంటే కేవలం మాట్లాడుకునేదే కాదని అది ఒక జాతి చరిత్ర,సంస్కృతి,సాంప్రదాయాలు,విలువలను ప్రతిబింబించే అద్దం లాంటిదన్నారు.కవి బండికల్లు జమదగ్ని మాట్లాడుతూ భాషావైవిద్యాన్ని కాపాడటం,మాతృభాషల వినియోగాన్ని ప్రోత్సహించడం బహుభాషా విద్యను అభివృద్ది చేయడం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ ప్రధాన ఉద్దేశ్యమన్నారు.

**-పాడనా తెలుగు పాట కార్యక్రమం**

అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా గాయనీ గాయకులు రాజశేఖర్,సాయిబాబు, రమణి,గఫూర్,విజయలక్ష్మి లు పాడనా తెలుగు పాట అంటూ గేయాలు ఆలాపించారు.

## ప్రజారోగ్యంలో ఫార్మసీ స్టోర్లు పాత్ర కీలకం

**గుంటూరు విద్య, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** : భారతదేశంలో అతి పెద్ద, అత్యంత విశ్వసనీయమైన ఫార్మసీ నెట్‌వర్క్ అయిన అపోలో ఫార్మసీ.. ఆంధ్రప్రదేశ్‌లో తన వెయ్యో స్టోర్‌ను విశాఖపట్నంలోని ఈ స్టోర్‌ను నగర పోలీసు కమిషనర్, డాక్టర్ శంఖబ్రత బాగ్చీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అపోలో ఫార్మసీ సీఈఓ పి.జయకుమార్, సీఓఓ బాలమురుగన్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ,"నాణ్యమైన మందులు, ఇతర వెల్‌నెస్ ఉత్పత్తులు అందుబాటులో ఉండడం అనేది ప్రజారోగ్య రంగంలో చాలా కీలకం అన్నారు. పౌరులకు సమర్థంగా ఈ తరహా వైద్య సేవలు అందించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు ఈ స్థాయిలో కల్పిస్తున్నందుకు అపోలో ఫార్మసీని నేను అభినందిస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వారి సేవలు మరింతగా అందించడం కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నాను" అన్నారు.

## నామమాత్రపు ఫీజులతో సొంత ఊరిలో వైద్య సేవలు

**మంగళగిరి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి లోని రెడ్ల బజార్ రామాలయం వద్ద ఆదివారం నూతనంగా శ్రీ అంజనాద్రి పాలీ క్లినిక్ ను విజయవాడ ప్రభుత్వ హాస్పటల్ మాజీ సూపరిటెండెంట్ డాక్టర్ కుర్రా శివశంకరరావు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పలు రాజకీయ ప్రముఖ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎంబి పవన్ కుమార్ మాట్లాడుతూ నూతనంగా శ్రీ అంజనాద్రి పాలి క్లినిక్ ను అమరావతి రాజధాని భాగమైన ఉండవల్లిలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు అతి తక్కువ ఫీజు తో షుగర్, బిపి, జ్వరాలు మైగ్రేన్ తలనొప్పి,కామెర్లు, థైరాయిడ్, ఉబకాయం, యూరిన్ సమస్యలు, ఆస్తమా, ఊపిరితిత్తుల నిమ్ము సమస్యలు, గ్యాస్ట్రిక్ అల్సర్, లివర్ సమస్యలు, కీళ్ల నొప్పులు,తిమ్మిర్లు ఫిట్స్, గుండె సమస్యలు కిడ్నీ సమస్యలు, ప్రివెంటివ్ హెల్త్ చెకప్స్ వంటి వైద్య అందించడం జరుగుతుందని తెలిపారు. డాక్టర్ శ్రీ వర్షిత మాట్లాడుతూ మా క్లినిక్ నందు



హైరిస్క్ ప్రెగ్నెన్సీ, గర్భిణీ స్త్రీలకు హైబీపీ షుగరు థైరాయిడ్, రక్తహీనత అనీమియా, నీటి బుడగలు, నెలసరి సమస్యలు, గర్భాసి క్యాన్సర్,మెనో పాస్ సమస్యలు, ఫ్యామిలీ ప్లానింగ్, బాలింతలకు సంబంధించిన సమస్యలు అన్ని రకాల వైద్యం అందించబడుతుందని తెలిపారు. అన్నివేళలా అందుబాటులో ఉంటూ వైద్యం అందించడం ఉన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేకల హనుమంత్ రావు, కుర్రా చెన్న కేశవరావు, రాజకీయ నాయకులు జొన్న శివశంకర్, ముమ్మిడి సత్యనారాయణ, దానబోయిన సుందరరావు యాదవ్, సీనియర్ జర్నలిస్ట్ తాడి బోయిన నాగేశ్వరరావు,దాసరి కృష్ణ, వంగా నరేంద్ర, గాదె బసివిరెడ్డి, తాడి బోయిన భాస్కర్, కందుల సూర్యనారాయణ, కళ్ళం సంజీవ్ రెడ్డి, దంటూ బాలాజీ రెడ్డి గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కెఎల్‌యులో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

**తాడేపల్లి,ఫిబ్రవరి 22,ప్రభాతవార్త :** కెఎల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల విభాగం ఆధ్వర్యంలో మెగాస్థాయి క్లస్టర్ బేస్డ్ ఆత్మీయ సమావేశం వేడుకలను ఘనంగా నిర్వహించారు.కార్యక్రమం మైటీ మెకానికల్ పూర్వ



విద్యార్థులు 2012-16 మరియు 1996-2000బ్యాచ్ లకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడింది.పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.సిహెచ్ శ్రీకావ్య కన్వీనర్‌గా,అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.సోనీ కో-కన్వీనర్‌గా వ్యవహరించారు.విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జె.పార్థసారథి వర్మ ముఖ్యఅతిథిజగా హాజరయ్యారు.వారితో పాటుగా రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు,ఐక్యుఏసి-క్వాలిటీ డీన్ డాక్టర్ కె.రామకృష్ణ స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్,మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టి.విజయ్‌కుమార్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా యూనివర్సిటీ తరుపున కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రపంచ వ్యాప్తంగా స్థిరపడిన పూర్వ విద్యార్థులు కార్యక్రమంలో ఆనందంగా పాల్గొన్నారు.తమ విద్యార్థి దశ జ్ఞాపకాలను పంచుకుంటూ,ఉద్యోగ రంగంలో తమ ప్రయాణం,సాధించిన విజయాలు,ఎదురైన సవాళ్ళ గురించి ప్రస్తుత విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న కాలంలో మెకానికల్ విభాగానికి ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉంటుందని,ఉద్యోగ అవకాశాలు పెద్దఎత్తున వస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు.మెకానికల్ విభాగంలో పట్టాను పొందడం వలనే తాము ప్రస్తుతం ఈ స్థాయిలో స్థిరపడగలిగామని సంతోషం వ్యక్తం చేశారు.ఈ సమావేశం పూర్వ విద్యార్థుల మధ్య అనుబంధాన్ని బలోపేతం చేయడమే కాకుండా,ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకం అందించే వేదికగా నిలిచింది.ఈ కార్యక్రమలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జె.పార్థసారథి వర్మ,ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్,డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్,డాక్టర్ కె.రాజశేఖరరావు,స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాద్,మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టి.విజయకుమార్,విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్.ప్రసాద్,కార్యక్రమ కన్వీనర్ పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.సిహెచ్ శ్రీకావ్య,కో-కన్వీనర్,అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.సోనీ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండ ముఖ్యమంత్రి సహాయనిధి : ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి పనిచేస్తుందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. చింతలపూడిలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆదివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ముఖ్యమంత్రి సహాయనిధిని నిర్లక్ష్యం చేశారన్నారు. ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నారా చంద్రబాబునాయుడు పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి చేయూతనిస్తున్నారు. పేదల పట్ల ఈ ప్రభుత్వానికి వున్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. మండల, పట్టణ పరిధిలోని 25మంది లబ్దిదారులకు రూ.13,15,872 అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, మగ్బుల్‌బేగ్, బండ్లమూడి బాబూరావు,



గణిపిశెట్టి రామకృష్ణ, సుఖవాసిసుధీర్‌చంద్, అలపర్తి చంద్రమోహన్, బండారుపల్లి శ్రీనివాసరావు, షేక్ బాజిసాహెబ్ తదితరులున్నారు.

# ఎన్ఆర్ఈజీఎస్‌ను పక్కాగా అమలు చేసిన ఘనత భాజపాదే : భాజపా నాయకులు పూల సుబ్రహ్మణ్యం

**పొన్నూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని దేశంలో పక్కాగా అమలు చేస్తున్న ఘనత భారతీయ



జనతాపార్టీదేనని బిజెపి నాయకుడు పూల సుబ్రహ్మణ్యం అన్నారు. మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు గ్రామంలో బిజెపి జెండా పేదవానికి అండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం వంద రోజుల నుండి 125రోజులకు పెంచిన ఘనత బిజెపిదేనన్నారు.పిడిఎస్ కింద రాష్ట్రంలో నాలుగు కోట్ల మందికి బియ్యం అందించడం చాలా గొప్ప విషయమన్నారు. ఎన్టీఆర్, ప్రధానమంత్రి ఆవాస్‌యోజన ద్వారా రాష్ట్రంలో 26లక్షల మందికి ఇళ్ళు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దేశాభివృద్ధిలో బిజెపి నేతృత్వంలోని ప్రధానమంత్రి నరేంద్రమోడి తీసుకొంటున్న సంస్కరణలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథకంలోకి తీసుకెళ్తున్న ఘనత బిజెపిదేనన్నారు. సభలో బిజెపి అమలు చేస్తున్న పథకాలు, అవలంభిస్తున్న విధానాలు, రాష్ట్రాభివృద్ధికి బిజెపి ఇస్తున్న నిధులు తదితరాల గురించి వివరించారు. కార్యక్రమంలో పూల కోటేశ్వరరావు, తాడిశెట్టి గోపి,జి.మదుసూధనరావు, నాగిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

# తడిచెత్తను సేంద్రియ ఎరువుగా మార్చవచ్చు : మున్సిపల్ కమిషనర్

**తెనాలి మున్సిపాలిటీ ఫిబ్రవరి 22(ప్రభాతవార్త):** తడి చెత్తను సేంద్రియ ఎరువుగా తయారు చేసుకోవడం వల్ల చెత్తను చాలావరకు తగ్గించవచ్చని మున్సిపల్ కమిషనర్ రామా



అప్పలనాయుడు తెలిపారు. స్థానిక చెంచుపేటలో పురపాలక సంఘ ఆధ్వర్యంలో నడుస్తున్న సేంద్రీయ కూరగాయల సాగు కేంద్రంను ఆదివారం కమిషనర్ పరిశీలించి,అరటి పిలకలు నాటించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వచ్చే చెత్తను తడిచెత్త పొడి చెత్త గా వికేంద్రీకరణ చేసి,తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువును తయారు చేసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు.కుళ్ళిపోయే స్వభావం కలిగిన కూరగాయలు,ఇతర వ్యర్థాలను ఎవరి ఇండ్లలో వారు ఒక డబ్బాలో వేసి ఎరువుగా తయారు చేసుకొని తమ ఇండల్లో,పెరట్లో పెంచుకునే కూరగాయ మొక్కలకు, పూలమొక్కలకు వినియోగించుకోవడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయని,తద్వారా చెత్త బయటకు రాకుండా, ఎక్కడికక్కడ ఎరువుగా తయారు చేసుకోవడం ద్వారా చెత్తను తగ్గించవచ్చని చెప్పారు. ఈవిధానంపై మున్సిపల్ సిబ్బంది నగర దీపికలు, అవగాహన కల్పిస్తారని చెప్పారు. చెంచుపేటలో పురపాలక సంఘం నిర్వహిస్తున్న సేంద్రీయ కేంద్రంలో కూరగాయల తడిచెత ద్వారా తయారు చేసిన 50 కేజీల సేంద్రియ ఎరువును 200 అరటి పిలకలకు ఎరువుగా వాడుతున్నట్లు చెప్పారు. సేంద్రియ ఎరువు ద్వారా పండించిన కూరగాయల ద్వారా మంచి ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. చెత్తను తగ్గించి,పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు సూచించారు.

# విఐటిలో ఘనంగా సాంస్కృతిక ఉత్సవాలు

**తుళ్ళూరు,ఫిబ్రవరి 22,ప్రభాతవార్త :** రాజధాని అమరావతి పరిధిలోని విఐటి విశ్వవిద్యాలయంలో వార్షిక క్రీడ,సాంస్కృతిక ఉత్సవాలు విటోపియా-2026 ప్రారంభమయ్యాయి.ఈ



కార్యక్రమంలో వసుదైకం అనే వివిధ దేశాలు,భారతదేశంలోని వివిధ రాష్ట్రాల సంస్కృతిని ప్రతిబింబించే సాంప్రదాయ ర్యాలీతో ప్రారంభమయ్యాయి.విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ పి.అరుల్మోళివర్మన్ మాట్లాడుతూ విటోపియా-2026 వార్షిక క్రీడల,సాంస్కృతిక ఉత్సవంలో పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.విద్యతో పాటు క్రీడా,సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసరమని,అవి విద్యార్థుల మానసికాభి వృద్ధికి ఎంతో దోహదపడతాయని చెప్పారు.విటోపియా వంటి క్రీడల,సాంస్కృతిక ఉత్సవం ద్వారా విద్యార్థులు తమ క్రీడా,సాంస్కృతిక ప్రతిభను పెంపొందించుకోవడానికి సాధ్యపడుతుందన్నారు.కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర ముదిగంటి,ఎస్.గోపికృష్ణన్ (విటోపియా కన్వీనర్),ఖాదీర్ పాషా (స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్), విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రత్యేక ఆహ్వానితులు, అతిథులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పెద్దేటమ్మ తల్లికి అంబటి ప్రత్యేక పూజలు

**పొన్నూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మామిళ్ళపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ పెద్దేటమ్మ తల్లి అమ్మవారికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆదివారం మొక్కులు తీర్చుకున్నారు. అన్ని గ్రామాల్లో ఆయా గ్రామాలకు గ్రామ దేవతలుంటారని, వారందరికీ ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యేక పూజలు చేయడం పురాతన



కాలం నుంచి వస్తున్న సంప్రదాయమన్నారు. గ్రామ దేవతలు గ్రామాన్ని ఎల్లప్పుడూ కాపాడుతూ ఉంటారన్నారు. అలాంటి అమ్మవార్లను సేవించడం మానవ ధర్మమన్నారు. శ్రీ పెద్దేటమ్మ తల్లి అత్యంత మహిమాన్వితమైన అమ్మవారుగా వెలుగొందుతున్నారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

# బాపనపల్లికి ఉగాది మహోత్సవ్ అవార్డు

**పొన్నూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బాపనపల్లి ప్రభాకర లక్ష్మీప్రసాదరావుకు ఉగాది మహోత్సవ్ అవార్డు వరించింది. బాపనపల్లి ప్రభాకరరావు గుంటూరు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడుగా పనిచేసి, ఆర్యవైశ్యం



అభివృద్ధికి విశేషమైన సేవలు అందించారు. అదేవిధంగా పొన్నూరు శ్రీ సహస్రలింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి దేవాలయం ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా పనిచేసి దేవాలయం అభివృద్ధికి తనవంతు కృషి చేశారు. ప్రస్తుతం ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి తనవంతు కర్తవ్యాన్ని కొనసాగిస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచారు. వివాదరహితుడుగా, సేవతాతత్పరుడు, సౌమ్యుడుగా ప్రజల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించారు. బాపనపల్లి సేవలను గుర్తించిన సి.వి.రామన్ అకాడమీవారు బాపనపల్లికి గోల్డ్‌మెడల్ అవార్డుకు ఎంపిక చేసి విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. బాపనపల్లి ఉత్తమ అవార్డు అందుకోవడం పట్ల అవ్వారు వెంకటేశ్వరరావు, అవ్వారు సురేష్, అన్నవరపు నాగ వెంకటకృష్ణారావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు అభినందించారు.

# పోస్టల్ సేవలను పునరుద్ధరించాలి

**తెనాలి మున్సిపాలిటీ,ఫిబ్రవరి 22,(ప్రభాతవార్త):** పట్టణంలో ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకు సేవలు అందిస్తున్న మూడు సబ్ పోస్టాఫీస్ లను ఫిబ్రవరి 1వ తేదీనుండి మూసివేశారని, పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం నాయకులు పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలనుండి,ప్రజలకు సేవలందించిన ఐతానగర్,చినరావూరు, పినపాడు సబ్ పోస్టాఫీస్ లను హెడ్



పోస్టాఫీస్ లో కలపటం వల్ల ఆ ప్రాంతప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,కావున వారందరికీ సౌకర్యార్థం తిరిగి వాటిని పునరుద్దరించాలని పట్టణ పరిసరప్రాంత అభివృద్ధి సంఘ నాయకులు,స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# పేదలకు పెన్షన్లు,నిత్యవసర సరుకులు పంపిణీ

**గుంటూరు విద్య ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** గుంటూరు స్థానిక అరండల్ పేటలోని అవోప కార్యాలయంలో ఆదివారం అవోపా అధ్యక్షులు కేవీ బ్రహ్మం అధ్యక్షతన 108 మంది పేదలకు పెన్షన్లు మరియు నిత్యవసర వస్తువుల పంపిణీ కార్యక్రమం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంటూరు మిర్చి యార్డ్ డైరెక్టర్ కొనకళ్ళ సత్యం, విశిష్ట అతిథి చార్టెడ్ అకౌంటెంట్ రేపాల మంగేశ్వరరావు, ప్రత్యేక అతిధులు డాక్టర్ కొత్త మాసు దినేష్ పాల్గొన్నారు. పాల్గొన్నారు . ముఖ్య అతిథి కొనకళ్ళ సత్యం మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ప్రతినెల 108 మంది పేదలకు ఒక్కొక్కరికి 500 రూపాయలు చొప్పున పెన్షన్ ఇవ్వటము, వెయ్యి రూపాయలు విలువ చేసే నిత్యవసర



వస్తువులు,విద్యార్థులకు స్కాలర్షిప్లు ఇవ్వడం అభినందనీయమని అవోప ద్వార నిర్వహించే కార్యక్రమాలకు తన వంతు సహకారాన్ని అందిస్తానని తెలిపినారు పేదలకు ప్రభుత్వ పరంగా అందాల్సిన పథకాలు కు సహాయం చేస్తానని తెలిపినారు. డాక్టర్ కొత్తమాసు దినేష్ మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా ప్రతి వారికి షుగర్ వ్యాధి వస్తున్నదని. షుగర్ వ్యాధి రాకుండా వస్తే ఎలా నివారించుకోవాలో తగు సూచనలను చేయడం జరిగినది. అవోప ద్వారా పెన్షన్ పొందే వృద్ధులకు ఉచితముగా వైద్యం అందిస్తానని తెలిపారు. విశిష్ట అతిధి చార్టెడ్ అకౌంటెంట్ రేపాల మంగేశ్వరరావు మాట్లాడుతూ ఆవోపా పేదలకు ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం ప్రతివారం గో సేవను నిర్వహించటం అభినందనీయమని తెలిపారు .ప్రతి వ్యక్తి జీవితంలో వీలునామా రాస్తే కుటుంబ బంధాలు నిలబడతాయని తెలిపారు.. ఈ సందర్భంగా గుంటూరు మిర్చి యార్డ్ డైరెక్టర్గాగా నియమితులైన టువంటి కొనకళ్ళ సత్యమును అవోప ఆధ్వర్యంలో ఘనముగా సన్మానించినారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాధాకృష్ణయ్య,ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు ప్రోగ్రాం కోఆర్డినేటర్ మద్ది సాయి రమేష్, మట్టుపల్లి రవికుమార్, వడకట్టు సునీల్, స్వామి గుప్తా, అమర రమేష్ అడ్డగాళ్ళ రామారావు, తదితరులు పాల్గొన్నారు

# న్యూరాలజీ సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 22,ప్రభాతవార్త :** స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో పక్షవాతం,న్యూరాలజీ సమస్యలపై ఆరోగ్యసభ నిర్వహించారు.ప్రధానవక్తగా న్యూరాలజిస్ట్ డాక్టర్ సిహెచ్ అమూల్య హాజరై ప్రసంగించారు.ఎక్కువకాలం నుండి మధుమేహంతో బాధపడే వారిలో కంటికి సంబంధించిన రెటినోపతి,గుండెకు



సంబంధించిన కార్డియోమయోపతి,కిడ్నిలకు సంబంధించిన నెఫ్రోపతి ,కాళ్ళ నరాలకు సంబంధించిన న్యూరోపతి సమస్యలతో బాధపడుతున్నారా అలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే మధుమేహం ఎప్పుడూ అదుపులో ఉంచుకోవాలని,మూడు నెలలకు ఒకసారి హెచ్‌బిఏ1సి పరీక్ష ద్వారా రక్తంలో చక్కరస్థాయిలను తెలుసుకొని డాక్టర్ ను సంప్రదించి తగిన విధంగా మందులు వాడాలన్నారు.ప్రతిరోజు 40నిమిషాల పాటు వ్యాయామం చేస్తూ,మానసిక వత్తిడి కలిగించే విషయాలకు దూరంగా ఉంటూ,మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చన్నారు.ఆరోగ్యసభలో సంస్థ సభ్యులు న్యూరాలజీ కి సంబంధించిన సమస్యలపై లేవనెత్తిన సందేహాలను డాక్టర్ అమూల్య నివృత్తి చేశారు.ఆరోగ్యస భానంతరం డాక్టర్ అమూల్య ను సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు.సభకు టివి సాయిరామ్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా,విశ్రాంత ప్రిన్సిపాల్ ముప్పాళ్ళ ప్రసాదరావు,అధ్యాపకులు రామకృష్ణారెడ్డి,సంస్థ సీనియర్ సభ్యులు ఎన్.సాంబశివరావు లు పాల్గొని ప్రసంగించారు.

# సమాజ మార్పు కోసం ఉద్యమించి కలసి నడిచే వారిని సభ్యులుగా చేర్చండి : ఎమ్మెల్సీ పిడుగు

**వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** సమాజ మార్పు కోసం ఉద్యమించి కలసి నడిచే వారిని పార్టీలో సభ్యులుగా చేర్చాలని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు శాసనమండలి సభ్యులు పిడుగు హరిప్రసాద్



పేర్కొన్నారు. గుంటూరు జనసేన పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జనసేన పార్టీ నేతలతో ముఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జనసేన పార్టీ ఎమ్మెల్సీ సభ్యులు పిడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ.. ఈ నెల 26వ తేది నుండి పార్టీ సభ్యత్వం నమోదు నిమిత్తం సమన్వయకర్తలు, నాయకులు, కార్యకర్తలకు పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు గురించి అవగాహన కల్పించారు. గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం ఇన్చార్జ్ గా నియమితులైన సందర్భంగా ప్రతీ నియోజకవర్గంలో ఎప్పటికప్పుడు సాధక్ (వాలింటర్లు)లను పర్యవేక్షిస్తూ గత సంవత్సరం కంటే ఈ ఏడాది గుంటూరు పార్లమెంట్ పరిధిలో జనసేన సభ్యత్వాలను అత్యధికంగా చేయాలని వివరించారు. పార్లమెంటు పరిధిలోని ప్రతి జనసేన కార్యకర్త, వీరమహిళలు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాన్య కొణిదెల పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా అందరు రెన్యూవల్స్, మరియు నూతన సభ్యాత్వాలను (ఉద్యమి) సమాజంలో మార్పు కోసం ఉద్యమించి కలిసి నడిచే వారిని సభ్యులుగా చేర్చడంలో మన జనసైనికులు ముందంజలో ఉండాలని కోరారు. జిల్లాలో ప్రత్తి పాడు నియోజకవర్గంలో గత ఏడాది ఎక్కువ సభ్యత్వాలు నమోదు చేయటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకట రత్తయ్యను ప్రత్యేకంగా అభినందించారు. ప్రారంభంలో గుంటూరు 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకట రత్తయ్య, జిల్లా కార్యదర్శి దేగల లక్ష్మణ్ లు హరిప్రసాద్ కు స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో హరిప్రసాదను ఘనంగా సత్కరించి అభినందించారు.

# ఆధునిక విద్యకు శ్రీకారం చుట్టిన మహనీయులు అబుల్ కలాం

**వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** భారతదేశంలో ఆధునిక విద్యను తీసుకురావడానికి ఎనలేని కృషి చేసిన మహనీయులు, భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి, భారతరత్న స్వర్గీయ మోలానా అబుల్ కలాం ఆజాద్ అని పేర్కొన్నారు. అబుల్ కలామ్ ఆజాద్ 68వ వర్ధంతి సందర్భంగా గుంటూరు రూరల్ మండలం, ఏటుకూరు బైపాస్ వద్ద ఉన్న ప్రత్తి పాడు నియోజకవర్గ వైసీపీ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆజాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బలసాని కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. భారతరత్న మోలానా అబుల్ కలాం ఆజాద్ తన కలం, గళం ద్వారా బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన స్వాతంత్ర సమరయోధుడు, భారతావని గర్వించదగ్గ ముద్దుబిడ్డ అని కొనియాడారు. మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి గా ఆయన బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత దేశంలో ఆధునిక విద్యను తీసుకురావటానికి ఎనలేని కృషి చేసారని వివరించారు. ఆజాద్ ఆలోచనలను, సిద్ధాంతాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. భారత విద్యా వ్యవస్థను ఉన్నతంగా తీర్చిదిద్దిన మహనీయుడు ఆజాద్ అని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా విద్యారంగంలో ఎక్కడాలేని విధంగా సంస్కరణలను తీసుకురావడానికి తీసుకువచ్చిన ఘనత ఆజాద్ కే దక్కుతుందన్నారు. అబుల్ కలాం ఆజాద్ ను స్ఫూర్తిని తీసుకొని జగన్మోహన్రెడ్డి ప్రభుత్వంలో ప్రతి పేద విద్యార్థికి అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించడం జరిగిందని



గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో నాడు నేడు కార్యక్రమం ద్వార పాఠశాలలలో అదనపు తరగతి గదులు ఏర్పాటు, ఇంగ్లీష్ మీడియం లో బోధన, అమ్మఒడి, ఫీజు రీయంబర్స్ మెంట్ను ప్రతి పేద విద్యార్థికి అందిచారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యార్దులకు రూ.15 వేలు ఇస్తా మని, యువతకు ఉద్యోగాలు ఇస్తామని అబద్ధపు హామీలు ఇచ్చి ఒక్క పథకం కూడా అమలు చేయలేదని విమర్శిం చారు. కార్యక్రమంలో బలసానితో పాటు వైసిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# 4వ రాష్ట్రస్థాయి సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు విశేష స్పందన

**గుంటూరు విద్య ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్, ఈ అభ్యాస్ అకాడమీ సంయుక్తంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన "సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ లెవెల్ టు ఒలంపియాడ్" ప్రతిభా పరీక్షలకు విశేష స్పందన లభించిందని అపుస్మ రాష్ట్ర అధ్యక్షులు కొలసాని తులసి విష్ణు ప్రసాద్ పేర్కొన్నారు.స్థానిక అరండల్ పేట కెనడి హైస్కూల్లో పరీక్షా పత్రాలను ఆవిష్కరించిన అనంతరం అపస్మా రాష్ట్ర అధ్యక్షులు విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ ఈ అభ్యాస్ అకాడమీ సహకారంతో సాట్ ఒలంపియాడ్ ప్రతిభ పరీక్ష రెండు దశల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. హైస్కూల్ స్థాయిలో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, విశ్లేషణాత్మక నైపుణ్యం, మరియు తార్కిక ఆలోచనలను ప్రోత్సహిస్తూ గ్లోబల్ విద్యార్థులుగా రాణించేందుకు అపుస్మ జాతీయస్థాయిలో కృషి చేస్తున్నదని తెలియజేశారు.ఈ అభ్యాస అకాడమీ ఛైర్మన్ డాక్టర్ భువనగిరి ఫణి పవన్ శాస్త్రీ సీఈవో బి సాయి రామకృష్ణ లు మాట్లాడుతూ సాట్ ఒలింపియాడ్ తొలి దశ జనవరి 18 రాష్ట్రంలోని 125 ప్లస్ అపుస్మా అనుబంధ పాఠశాలలో నిర్వహించగా 15000 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల్లో మూడవ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రతి తరగతి నుండి 1,2,3 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రెండవ దశ ప్రతిభ పరీక్ష నిర్వహించామని ఈ దశలో రాష్ట్ర వ్యాప్తంగా 15 కేంద్రాల్లో ఏకకాలంగా 6000 మందికి పైగా విద్యార్థులు సాట్ ఒలింపియాడ్ పరీక్షను ఓఎంఆర్ పరీక్ష విధానములో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెండవ దశలో రాష్ట్రస్థాయి ఒకటి రెండు మూడు



ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మార్చి 8న గుంటూరులో నిర్వహించే అవార్డ్స్ ఫంక్షన్ లో నగదు ప్రశంస పత్రాలు జ్ఞాపకాలు అందజేయనున్నట్లు ఫణి పవన్ శాస్త్రీ సాయి రామకృష్ణలు తెలిపారు. పరీక్షా పత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో అపస్మా రాష్ట్ర నాయకులు కెనడీ శ్రీకాంత్ బాబు, విస్డమ్ రవి, చైతన్య సాంబిరెడ్డి, జిల్లా అధ్యక్షులు నాయుడు చక్రనాగ్ తదితరులు పాల్గొన్నారు

# సోమయాజుల విష్ణుప్రియకు గాయత్రి యువ సంగీత రత్న బిరుదు ప్రదానం

**గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 22,ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై గాయత్రి మహిళా సంగీత సమ్మండలి ప్రధాన కార్యదర్శి ఏం.వై.శేషురాణి ఆధ్వర్యంలో విధుషి సోమయాజుల విష్ణుప్రియ గాత్ర కచేరీ వీనుల విందుగా జరిగింది.ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమాన్ని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పాటిబండ్ల జానకి,ఆలయ పాలకమండలి వారు ముఖ్యఅతిథి విశ్రాంత ఏ.జి.ఎమ్ నాబార్డ్,హైదరాబాద్,కొంపెల్ల బి.ఎన్.శర్మ,రామరజు లక్ష్మీ శ్రీనివాస్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.అనంతరం అతిధులు సంస్థవారు సోమయాజుల విష్ణుప్రియకు గాయత్రీ యువ సంగీత రత్న బిరుదు ప్రదానం ఘనంగా సత్కరించారు.అనంతరం జరిగిన విష్ణుప్రియ గాత్ర సంగీత కచేరీలో పలు వాగ్గేయకార కీర్తనలను శ్రావ్యంగా ఆలాపించి సంగీతాభిమానులను అలరించారు.వీరికి వయోలిన్‌పై అంబటిపూడి కామాక్షి,హైదరాబాద్,మృదంగం పై కామరాజు కార్తికేయ శర్మ, విజయవాడ వారు చక్కటి వాయిద్య సహకారాన్ని



అందించారు.ఉపాధ్యక్షులు పాటిబండ్ల లలితాదేవి,కార్యదర్శి ఏ.వి.మంగాదేవి కళాకారులను,అతిధులను సత్కరించారు.

# కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరసనను జయప్రదం చేయండి: రైతు సంఘం పిలుపు

**పెదనందిపాడు, ఫిబ్రవరి22, (ప్రభాతవార్త):** రైతుల, కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘాల రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు జరిగే నిరసన కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు పిలుపునిచ్చారు. రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, పంటల భీమా పథకాన్ని ప్రభుత్వమే ఉచితంగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు వెంటనే శనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. గుంటూరు ఛానల్ పొడిగింపు కోసం నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలన్నారు. నల్లమడ వాగు ఆధునీకరణ పనులు వెంటనే చేపట్టాలని కోరారు. కౌలు రైతులకు భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని కోరారు. పై సమస్యల పరిష్కారానికి రైతు, కౌలు రైతు సంఘాలు రాష్ట్రవ్యాప్త పిలుపుమేరకు గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరసనలో రైతులు, కౌలు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.



# సంస్థ సభ్యులకు వినోదం పంచిన "అవగాహన" హాస్యవల్లరి

**గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 22,ప్రభాతవార్త :** అవగాహన సంస్థ ప్రతినెలా నిర్వహిస్తున్న హాస్యవల్లరి నవ్వు నవ్వించు కార్యక్రమం తమనెంతో ఆరోగ్యంగా ఆనందంగా ఉంచుతుందని,ఓ మంచి టానిక్‌లా ఉపయోగపడుతుందని అవగాహన హాస్యవల్లరి కోఆర్డినేటర్ కె.ఎస్.ప్రసాద్ అన్నారు.సంస్థ కార్యాలయంలో 128వ హాస్యవల్లరి కార్యక్రమం సంస్థ సభ్యుల జోక్స్,కామెడీ స్కిట్స్, హాస్య,వ్యంగ్య కవితలు పాటలతో హుషారుగా కొనసాగింది. హాస్యవల్లరి బృంద సభ్యుల కన్వీనర్,కవి జమదగ్ని మాట్లాడుతూ హాస్యం గొప్ప ఔషదిలా పనిచేస్తుందని ఇదోక ఆరోగ్యదాయిని, ఆనందదాయిని అని నవ్వు ఆరోగ్యంగా ఉండు అంటూ అవగాహన సంస్థ ఆరోగ్యసభలు,నవ్వు నవ్వించు కార్యక్రమాలు నిర్వహించడం సంస్థ సభ్యులకు ఉపయోగకరంగా ఉందన్నారు.కార్యక్రమంలో పిసినారులూ వర్ధిల్లాలి,అఖిల భారత మూర్ఖుల దినోత్సవం అనే కామెడీ స్కిట్స్ అందర్ని కడుపుబ్బ నవ్వించాయి.కార్యక్రమలో హాస్యప్రియులు జి.పిచ్చయ్య, పవన్‌కుమార్,బి.బసవగుప్తా, శివప్రసాద్,రాఘవరావు,నాగేశ్వరరావు,పింగళి భాగ్యలక్ష్మీ,అప్పారావు లు అద్భుతంగా తమ హాస్యధోరణిని ప్రదర్శించారు.

